
0933520440
09305978486
09794359502
PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23

visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారమ్


Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.



RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 250 విశాఖపట్నం, 20 జూలై 2023 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల విచారణ వేగవంతం చేయాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యచార కేసుల్లో సత్వర పరిష్కారం కోసం విచారణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.మల్లికార్జున పోలీస్, రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం కలక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ నూతనంగా ఎన్నిక కాబడిన సభ్యులతో ఈ సంవత్సరం మొదటి, ద్వితీయ త్రైమాసిక సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలక్టరు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు సత్వర న్యాయం ద్వారా ప్రజల్లో కేసుల పరిష్కారం పట్ల నమ్మకం ఏర్పర చాలన్నారు. ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలను, పెండింగుకు గల కారణాలను పోలీస్ అధికారులతో చర్చించారు. సుదీర్ఘ పెండింగ్ కేసుల ను వెంటనే పరిష్కరించి తెలియజేయా లన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ (పీఓఏ), ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (పీసీఆర్) చట్టాల కింద నమోదైన ఎస్సీ, ఎస్టీ పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు చెల్లించే పరిహారంలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు 92 కేసులలో 88 మంది బాధితులకు రూ.1.15 కోట్ల పరిహారం చెల్లించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 95 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉండగా, 679 కేసులు పెండింగ్ ట్రయల్ దశలో ఉన్నాయన్నారు. అత్యధికంగా కుల ధృవీకరణ పత్రాలు పెండింగ్ ఉన్నాయని, కుల ధృవీకరణ పత్రాలు జారీచేసే విషయంలో ఆర్డీఓలు, తహశీల్దార్లు అలసత్వాన్ని ప్రదర్శించరాదన్నారు. పలువురు

(మిగతా 2లో)

## కంటి వైద్యంలో నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య శాలలో ఆత్మకూరి యశోద సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్మెంట్‌ను మంత్రి అమర్నాథ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ మారుతున్న కంటి వైద్య పరిశోధనలో అనేక కీలక మార్పులకు, ఈ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కృత్రిమ మేధోసంపత్తి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సాధనాలను వినియోగించుకొని కంటి వైద్యంలో నూతన ఆవిష్కరణల ద్వారా సమాజానికి సేవ చేయాలని తెలిపారు. కంటి ఆసుపత్రి నిర్వహణతో పాట విద్యార్థులకు ఉపాధి కల్పనలో భాగంగా శంకర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కళాశాలలో బి.స్సీ ఆప్టోమెట్రీ , డిప్లొమో , ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులలో వందలాదిమంది విద్యార్థులు విద్యను అభ్యసించడం ముదావహమని అమర్నాథ్ అన్నారు. కంటి వైద్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సమాజానికి సేవ చేయాలని ఆయన కోరారు. బయోమెడికల్ ఇంజనీరింగ్ , బయో టెక్నాలజీ రంగాల్లో అనేక మార్పులు వస్తున్న నేపద్యములో కంటి వైద్యంలో అనేక నూతనవరవడులు ద్వారా మారుతున్న సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకొని పరిశోధనలు జరిపి రోగులకు మంచి సేవలు అందించాలని మంత్రి కోరారు. ప్రస్తుత ఆధునిక కాలంలో చిన్న పిల్లలు, విద్యార్థులు స్మార్ట్ ఫోన్ లను ఎక్కువగా వినియోగిస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో వారికి కంటిచూపు మందగించే

(మిగతా 2లో)

## నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ రోజు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలకు సంబంధించి పలు అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఉభయ సభల సమావేశాలకు ముందు అఖిల పక్షం సమావేశం కావడం ఆనవాయితీ గా వస్తోంది. ప్రధానమంత్రి, కేంద్ర సీనియర్ మంత్రులు, వివిధ పార్టీల పార్లమెంటరీ పక్ష నేతలు ఈ సమావేశానికి హాజరవుతుంటారు.

ఇక రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మంగళవారమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కానీ, చాలా పార్టీల నాయకులు అందుబాటులో లేకపోవడంతో అది బుధవారానికి వాయిదా పడింది. అఖిల పక్ష భేటీ గురించి చర్చించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన కేబినెట్ సహచరులు ప్రహ్లాద్ జోషి, పీయూష్ గోయల్‌తో నిన్న సమావేశమయ్యారు.

కాగా, ఈ ఏడాది

(మిగతా 2లో)

## మధురవాడలో విషాదం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 5వ వార్డ్ పరిధి మధురవాడ శివశక్తినగర్ రోడ్డు లో బుధవారం ఘోర విషాదం నెలకొంది. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ప్రైవేట్ అపార్ట్మెంట్‌లో ఎంవికే ప్రసాద్ (54), రాజరాజేశ్వరీ (50) దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు కేసు నమోదు చేసి పి.ఎం.పాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఐదు రోజుల పాటు ఏపీని ముంచెత్తనున్న వర్షాలు



బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం మరికొన్ని గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే ఐదు రోజుల పాటు ఏపీలోని వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. మరోవైపు, దక్షిణ ఛత్తీస్ గఢ్ ప్రాంతంలో మరో ఆవర్తనం కొనసాగుతోంది.

దీని ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఐదు రోజుల పాటు సముద్రం అల్లకల్లోలంగా మారుతుందని, వేటకు వెళ్లొద్దని మత్స్యకారులను హెచ్చరించారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఏపీలోని ఉత్తర కోస్తాపై అల్పపీడన ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. ఉత్తర కోస్తా జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు, మిగతా ప్రాంతాలతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

ఏజెన్సీ, కొండ ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదవుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. గడచిన 24 గంటల్లో అత్యధికంగా చింతూరులో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. అల్లూరి జిల్లా ఏజెన్సీలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నయి. పాడేరు మండలం రాయగడ్డ వంతెన పొంగి 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పర్దనపుట్టు మత్స్యగెడ్డ పొంగి 50 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## ఏపీని అప్పుల పాలు చేస్తోంది ఈ ప్రభుత్వంపై : పురందేశ్వరి



జగన్ సర్కారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తోందని బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి మండిపడ్డారు. అధికారికంగా చేసే అప్పులకు తోడు అనధికారిక మార్గాల ద్వారా కూడా భారీ మొత్తంలో అప్పులు చేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి పురందేశ్వరి మాట్లాడారు. మద్యం అమ్మకాలపై భవిష్యత్తులో వచ్చే ఆదాయాన్ని పూచికత్తుగా చూపి రూ.8 వేల కోట్లకు పైగా ప్రభుత్వం అప్పులు తీసుకొచ్చిందని చెప్పారు.

ఇలా వివిధ మార్గాలలో నాలుగేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం రూ.4,74,315 కోట్ల అప్పులు చేసిందన్నారు. ఈ మొత్తానికి రిజర్వ్ బ్యాంకు నుంచి అధికారికంగా తీసుకున్న అప్పులు అదనమని చెప్పారు. ఈ అప్పులకు వడ్డీ రూపంలో రూ.50 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందని వివరించారు. రాష్ట్ర ఆదాయంలో దాదాపు 40 శాతం వడ్డీలు చెల్లించడానికే ఖర్చు చేయాల్సి వస్తే ఇక రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఎలా చేయగలరని ఆమె ప్రశ్నించారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను జగన్ ప్రభుత్వం దారిమళ్లిస్తోందని పురందేశ్వరి ఆరోపించారు. రాష్ట్రం సేకరించి పంపే పన్నుల ఆదాయంలో 42 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం వివిధ మార్గాలలో తిరిగిచ్చేస్తోందని చెప్పారు. యూపీఏ పాలనలో కేవలం 32 శాతం ఆదాయమే రాష్ట్రాలకు తిరిగివచ్చేదని ఆమె గుర్తుచేశారు. కాగా, జగన్ సర్కారు ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టి అప్పులు చేస్తోందని మండిపడ్డారు.

కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో పెడుతూ వారిని ఇబ్బంది పెడుతోందని, కొంతమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యకు కూడా పాల్పడ్డారని పురందేశ్వరి చెప్పారు. దీనిని బట్టి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని ఆమె అన్నారు.

### ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

## ట్రాన్స్‌ఫార్మర్ పేలి 15 మంది దుర్మరణం



దేహ్రాదూన్: ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో విద్యుదాఘాతానికి గురై 15 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో పోలీసులు కూడా ఉన్నారు. ఘటనలో పలువురు గాయపడ్డారు. చమోలీ జిల్లాలోని అలకనందా నదిపై ఉన్న నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నమామీ గంగా ప్రాజెక్టులో భాగంగా అలకనందా నదిపై ఉన్న వంతెనకు విద్యుత్ ప్రవాహం జరగడం వల్ల ఈ ఘోరం జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడం వల్ల వంతెన రెయిలింగ్‌కు విద్యుత్ ప్రవహించి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 'ఈ ప్రమాదంలో 15 మంది మృతి చెందారు. వారిలో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, హోం గార్డులు ఉన్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు జరుగుతోంది. రెయిలింగ్‌కు విద్యుత్ ప్రవాహం జరగడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నాం' అని ఉత్తరాఖండ్ ఏడీజీపీ వి. మురుగేశన్ వెల్లడించారు. పీపల్‌కోటి అవుట్ పోస్టు ఇంఛార్జి కూడా మృతి చెందినవారిలో ఉన్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అయితే ఈ ప్రమాదం జరిగిందని చమోలీ ఎస్పీ ప్రమేంద్ర ధోబాల్ వెల్లడించారు. 'వంతెన వద్ద ఉన్న భద్రతాసిబ్బంది ఒకరు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు మాకు సమాచారం అందింది'

(మిగతా 2లో)

## 7.33 కోట్లతో ప్రసిద్ధ బొజ్జన్న కొండ అభివృద్ధి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి మండలంలో శంకరంలోనున్న ప్రసిద్ధ బౌద్ధారామం బొజ్జన్న కొండ కేంద్ర ప్రభుత్వ స్వదేశ్ దర్శన్ పథకంతో ఏడు కోట్ల 33 లక్షల రూపాయలతో అభివృద్ధి చేసేందుకు ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి శ్రీకారం చుట్టడం ఆనందించదగ్గ విషయమని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్ల నాగభూషణం హర్షం వ్యక్తం చేశారు. అలాగే దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బొజ్జన్న కొండ అభివృద్ధికి గాను8 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసి ఈ బొజ్జన్న కొండను రాష్ట్రంలోనే అద్భుతమైన రీతిలో అన్ని హంగులతో అభివృద్ధి చేయటానికి గాను వచ్చే ఆగస్టు నెలలో పనులను ప్రారంభించిఈ డిసెంబర్ నాటికి పూర్తి చేయటానికి సంకల్పించడం పట్ల కూడా నాగభూష ణము తన హర్షాన్ని సంతోషాన్ని వ్యక్త పరిచారు.

(మిగతా 2లో)

## ఏయూతో ఎంవిఆర్ డిగ్రీ కళాశల ఎంఓయూ




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయంతో గాజువాకకు చెందిన ఎం.వి.ఆర్ డిగ్రీ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎం.వి.ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావులు సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందలో భాగంగా డిప్లమా ఇన్ యోగా, పీజీ డిప్లమా ఇన్ యోగా కోర్సులను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నేడు యోగా ప్రపంచ దేశాలకు సైతం చేరువ అయిందని, అందరికీ చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంవీఆర్ కళాశాల కోర్సుల నిర్వహణకు ముందుకు రావడం పట్ల అభినందించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు,యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు, ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## (మొదటి పేజీ తరువాయిలు)

### ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల విచారణ వేగవంతం చేయాలి

సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లాలో ఏసీపీల పరిధిలో ఎస్సీ ఎస్టీ కేసులు 2013 నుండి 2023 వరకు 97 కేసులు పోలీసు శాఖ ద్వారా విచారణలో ఉన్నాయని, ఈ కేసుల విచారణను సత్వరం పూర్తి చేయాలన్నారు. ఏడుగురు ఏసీపీలు , రెండు ఎస్సీ , ఎస్టీ సెల్ విభాగాలు తమ పరిధిలో కేసులు పరిష్కారం వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా బాధితులకు చెల్లించవల్సిన నష్టపరిహారం నిర్ణీత సమయంలో చెల్లించాలని, ఈ మేరకు సంబంధిత తహశీల్దార్లు, ఆర్డిఓలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సెల్ ద్వారా కేసులు సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కేసుల పరిష్కారంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ , పోలీస్ అధికారులకు అవసరమైన సహకారం అందించి కేసులు ఏ స్థాయిలో పెండింగ్ ఉన్నా వాటి సమస్యను గుర్తించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డివిజనల్ స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశాలు ప్రతినెలా ఏర్పాటు చేయాలని, ఈ సమావేశంలో పెండింగ్ కేసులకు సంబంధించి బాధితులకు తమ కేసుల వివరాలను చెప్పుకునే అవకాశం ఇవ్వాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసులు పరిష్కారంపై తీసుకోవాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారులతో చర్చించాలని కలక్టరు ఆదేశించారు.

కమిటీ సభ్యులు మాట్లాడుతూ సివిల్ రైట్స్ డే నిర్వహణ సక్రమంగా లేదని సరిగా నిర్వహించాలని కలెక్టర్ కు తెలిపారు . ఎస్సీ ,ఎస్టీలకు సంబంధించిన అన్ని రకాల జీవోలు సక్రమంగా అమలు చేయాలని కోరారు

సోషల్ వెల్ఫేర్ డిడి కె రామారావు గత సమావేశం నుండి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను , కేసుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ మరియు సభ్యులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, డిసిపి నాగన్న , సోషల్ వెల్ఫేర్ డిడి కే.రామారావు, ఏసీపీలు , పబ్లిక్ ప్రాసక్యూటర్ బి వి అర్ మూర్తి, ఈపిడిసిఎల్ ఎస్ ఈ , కార్మిక శాఖ అధికారి, కమిటీ సభ్యులు పి.మల్లేశ్వరరావు , దాసరి సామ్యూల్ , ఎ రాజబాబు , జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### కంటి వైద్యంలో నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రమాదం ఉందని అమర్నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. వీరు స్మార్ట్ఫోన్ వినియోగం తగ్గించుకునేలా కంటి వైద్యులు అవగాహన కల్పించాలని, అలాగే ఈ స్పాట్ ఫోన్ వినియోగం ద్వారా వచ్చే సమస్యలను నివారించే దిశగా పరిశోధనలు చేపట్టాలని అమర్నాథ్ కోరారు.

పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. కంటివెలుగు కార్యక్రమాలు అమలులో రాష్ట్రములోనే ఉత్తమ కంటి ఆసుపత్రిగా పేరు సంపాదించుకొందని అభినందించారు. కంటి వైద్య పరిశోధనలో అనేక కీలక మార్పులకు, ఈ సెంటర్ ఎంతగానో దోహదపడుతుంది అని తెలిపారు.

ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ ఆత్మకూరి కృష్ణ కుమార్ మాట్లాడుతూ తన ఆత్మకూరి శంకర్రావు ఆశయాలకు అనుగుణముగా శంకర్ ఫౌండేషన్, ట్రస్టీలు, డాక్టర్లు, ఉద్యోగులు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. నిష్ణాతులైన డాక్టర్ల ద్వారా శంకర్ ఫౌండేషన్ ముఖ్యముగా డయాబెటిక్ రెటినోపతి, గ్లకోమా, మయోపియా, కేరెటోకోనస్ తనికీలు ద్వారా వ్యాధిని త్వరగా నిర్ధారించి అతి త క్కువ ఖర్చుతో, నాణ్యమైన సేవలను అందిస్తుందని చెప్పారు. కంటి వైద్యంలో ఈ నూతన పద్ధతులను సాధించటానికి శంకర్ ఫౌండేషన్ పరిశోధన విభాగం (రీసెర్చ్ & డెవలప్మెంట్) అఫ్తాల్మోలజీ సైన్సు లో నూతన పద్ధతులలో ముందడుగు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శంకర్ ఫౌండేషన్లోని కార్నియా, గ్లకోమా, చిన్నపిల్లల కంటి వైద్యం, రెటీనా, ఆర్బిట్ విభాగాలలో నిష్ణాతులైన డాక్టర్లు, సిబ్బంది ద్వారా రోగులకు సేవలను అందిస్తోంది. అంధత్వ నివారణ సమాజసేవలో శంకర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని అన్నారు.

### నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

చివర్లో తెలంగాణ సహా పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో బీజేపీ, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం దాడులకు దిగడంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రసవత్తరంగా మారనున్నాయి. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ధరల పెరుగుదల, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం వంటి సమస్యలతో పాటు మణిపూర్ సంక్షోభంపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూస్తున్నాయి. గత సెషన్ కూడా తరచూ విపక్షాల నిరసనలతో హోరెత్తింది.

### ఉత్తరాఖండ్లో ఘోర ప్రమాదం

అని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 15 మంది మృతి చెందారని, మిగిలిన వారి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు.

విచారణకు ఆదేశించిన ముఖ్యమంత్రి :

ఈ ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఘటనాస్థలాన్ని పరిశీలించనున్నారు. అలాగే ఈ ఘటనపై జ్యుడిషియల్ విచారణకు ఆదేశించారు. 'ఇది తీవ్ర దురదృష్టకర ఘటన. సహాయక చర్యల నిమిత్తం పోలీసులు, విపత్తు నిర్వహణ సిబ్బంది ఘటనాస్థలిలో ఉన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం' అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. విద్యుత్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

### 7.33 కోట్లతో ప్రసిద్ధ బొజ్జన్న కొండ అభివృద్ధి

ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బౌద్ధారామాన్ని అభివృద్ధి పరిచేందుకు స్థానికపార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బి వి.సత్యవతి బొజ్జన్న కొండ అభివృద్ధికి గాను పార్లమెంట్ లో ప్రస్తావించడమే గాక ఆయా శాఖల మంత్రులతో కలిసి ఇరు ప్రభుత్వాలను సమన్వయ పరచి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారన్నారు.

# ఓబీసీ సాధనకై జీవీఎల్ మద్దతు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): గత కొన్ని దశాబ్దాలుగా %ాదీజ% సాధనకై వివిధ ప్రయత్నాలు చేసి అవి నిష్ఫలమవడంతో నిరాశలో నున్న కళింగవైశ్య/కోమటి ,శిష్ట కరణ మరియు సొండి సామాజిక వర్గాల ప్రతినిధులతో బిజెపి ఎంపీ జీవీఎల్ నరసింహారావు గత కొన్ని రోజులుగా చర్చిస్తూ వారిని కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి తోనూ మరియు జాతీయ వెనుకబడిన కులాల కమీషన్ చైర్మన్ తొనూ సమావేశ పరచేందుకు వారిని ఈరోజు ఢిల్లీ ఆహ్వానించారు.

వారందరితో ఈరోజు తన నివాస గృహంలో సమావేశమై మరోసారి కూలంకషంగా చర్చించి పూర్తి వివరాలతో జీవీఎల్ ముందుగా కేంద్ర సామాజిక న్యాయ శాఖా మంత్రి శ్రీ వీరేంద్రగారి తోనూ మరియు %చీజదీజ% చైర్మన్ శ్రీ హన్స్ రాజ్ ఆహిర్ తోనూ ముందుగా సమావేశమై వారిరువురికీ పై మూడు సామాజిక వర్గాల వెనుకబాటుతనాన్ని వారిని ఓబీసీ లో చేర్చాల్సిన అవసరాన్ని గూర్చి కూలంకషంగా వివరించారు..

**కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి శ్రీ వీరేంద్ర గారితో సమావేశం**

తరువాత జీవీఎల్ కళింగవైశ్య ,శిష్ట కరణ,సొండి సామాజిక వర్గ ప్రతి ప్రతినిధులతో కలిసి కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి శ్రీ వీరేంద్ర గారితో సమావేశం అయ్యారు.ఆయా సామాజిక వర్గ ప్రతినిధుల సమక్షంలోనే జీవీఎల్ పూర్తి పై మూడు సామాజిక వర్గాల నేపథ్యం గూర్చి వారిని ఓ బి సి లో చేర్చాల్సిన అవసరం పై తన నివేదికను అందజేయగా కేంద్ర న్యాయశాఖ మంత్రి వెంటనే స్పందించి మంత్రిత్వ శాఖ అధికారులను పిలిచి దీనిని పరిశీలించి వెంటనే తదుపరి కార్యాచరణకు ఉపక్ర మించవలసిందిగా ఆదేశించడం జరిగింది.

**ఎన్సీబీసీ చైర్మన్ శ్రీ హన్సరాజ్ అహిర్ తో సమావేశం**

ఆ తర్వాత జీవీఎల్ కళింగవైశ్య,శిష్ట కరణ, సొండి సామాజిక వర్గ ప్రతినిధులు అందరినీ జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ శ్రీ హాన్సరాజ్ ఆహిర్ తో సమావేశపరిచారు.దశాబ్దాలుగా ఓబీసీలో చేరడానికి వారు చేస్తున్న ప్రయత్నాలను మరియు వారి యొక్క సామాజికవర్గ నేపథ్యం, వెనుకబాటుతనాన్ని గురించి చైర్మన్ కు వివరించి నివేదికను అందజేయగా పరిశీలించిన శ్రీ ఆహిర్ జీవీఎల్ గారి ఆహ్వానం మేరకు ఆగస్టు1న పై మూడు తరగతుల వారిని కలిసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రానున్నానని తెలియజేస్తూ, వెంటనే ఎన్సీబీసీ అధికారులను పిలిచి ఈ నివేదికను పూర్తి కూలంకషంగా పరిశీలించి ముందుకు వెళ్లాల్సిందిగా ఆదేశించారు.

దీనిపై మూడు సామాజిక వర్గ ప్రతినిధులందరూ హర్షం వ్యక్తం చేస్తూ ఇంతకాలం కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమైన తమ ఓబిసి సాధన కల శ్రీ జీవీఎల్ ప్రయత్నంతో ముందుకు సాగుతున్నదని,వారి సహాయంతో కచ్చితంగా ఓబీసీ సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేస్తూ శ్రీ జీవీఎల్ గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు.

ఎన్నో దశాబ్దాలుగా తీరని కలగా మిగిలిన ఓబీసీ సాధన తో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ మరియు విద్యా అవకాశాల్లో తమ వాటా కొరకు పై మూడు సామాజిక వర్గాలు చేస్తున్న ఈ ప్రయత్నాలు జీవీఎల్ కృషి వల్ల సఫలమయ్యే దిశగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని చెప్పవచ్చు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కలిసిన పీతల మూర్తి యాదవ్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ దగ్గుపాటి పురందేశ్వరిని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ విజయ వాడలో బుధవారం కలిసి అభినందించారు.

రాష్ట్ర అభివృద్ధికి బిజెపి జనసేన కలిసి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించినట్టు మూర్తి యాదవ్ తెలిపారు. ఇరు పార్టీల పొత్తు నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో జనసేన బిజెపితో కలిసి పోటీ చేయనున్నామని ఆయన వెల్లడించారు. బిజెపి రాష్ట్ర కార్యాల యంలో పురందేశ్వరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

## ఈ నెల 21 నుంచి నెలరోజుల పాటు ఇంటింటి సర్వే



కాకినాడ, (విశాఖ సమాచారమ్): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)-2024 కార్యకలాపాల్లో భాగంగా ఈ నెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు.

బుధవారం కలెక్టరేట్ కోర్టుహాల్లో కలెక్టర్ కృతికా శుక్లా.. డీఆర్వో కె.శ్రీధర్రెడ్డితో కలిసి ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్-ఎస్ఆర్)-2024 కార్యకలాపాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు భారత ఎన్నిక సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా కృషిజరుగుతోందని.. ఈ కృషికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సహాయసహకారాలు అందించాలని కోరారు. వెంటనే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ (బీఎల్ఏ)లను నియమించుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్వో) ఇంటింటి సర్వే నిర్వహిస్తారని.. కొత్తగా ఓటరుగా చేర్చేందుకు అర్హత ఉన్నవారు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు తదితర వివరాలను నమోదు చేస్తారని వివరించారు. ఈ సర్వేతో పాటు ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియలో గ్రామ, వార్డు వాలంటీర్లు పాల్గొనరని స్పష్టం చేశారు. చేర్పులు, తొలగింపులకు సంబంధించిన నిబంధనలు, అవసరమైన ఫారాలు, ధ్రువీకరణ పత్రాలు తదితరాలపై ఇప్పటికే బీఎల్వోలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. 2024, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదుకు అర్హులని వివరించారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8లు బీఎల్వోలు, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 17న ఇంటిగ్రేటెడ్ ముసాయిదా ఓటర్లను జాబితాను ప్రదర్శించనున్నామని.. ఆపై నవంబర్ 30వ తేదీ వరకు క్లెయిమ్లు, అభ్యంతరాలను స్వీకరిస్తారని తెలిపారు. వీటిని డిసెంబర్ 26వ తేదీలోగా పరిష్కరించి.. 2024, జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 1,634 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని..అవసరం మేరకు వీటిని హేతుబద్ధీకరించనున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటర్ల జాబితా రూపకల్పన జరుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా స్పష్టం చేశారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథంతో పాటు ఆర్.వెంకటేశ్వరరావు(వైఎస్ఆర్ కాంగ్రెస్), చిక్కాల రామచంద్రరావు (తెలుగుదేశం), బీవీ నాయుడు (కాంగ్రెస్), ఎస్.అప్పారావు (బీఎస్పీ), కె.వీరబాబు (సీపీఎం), ఎన్.శివ(ఆమ్ ఆద్మీ పార్టీ) తదితరులు హాజరయ్యారు.

## 'అల్లూరి' వరదలు పట్ల అప్రమత్తంగా ఉన్నాం!



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉధృ తంగా కురుస్తున్న వర్షాలకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్చార్జి మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడించారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది జూలై 9వ తేదీన శబరి నది ఉప్పొంగి చింతూరు ప్రాంతం అంతా జలమయమై, అనేక గ్రామాలు నీట మునిగాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి అక్కడ ప్రజలకు పునరావాసం కల్పించిందని తెలియజేశారు. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ముందుగానే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాను అల్లూరి జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించానని అమర్నాథ్ చెప్పారు. అల్లూరి జిల్లాకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిం చేందుకు కూడా రంగం సిద్ధం చేశామని మంత్రి పేర్కొన్నారు. వరద ఉధృతి పెరిగినా, అల్లూరు జిల్లా ప్రాంత ప్రజలు ఇబ్బంది పడకుండాఅన్ని జా గ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పా రు. వైద్య సిబ్బందిని, రెవిన్యూ సిబ్బంది అప్ర మత్తం చేశామని ఆయన తెలియజేశారు. గత ఏడాది వరద ఉగ్రరూపం దాల్చినా, ఏ ఒక్కరు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నా మని, ఆ తర్వాత వరదల్లో నష్టపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం కూడా అందించింది అన్న విషయాన్ని మంత్రి అమర్నాథ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

| | |
|---|---|
| పంచాంగం | గురువారం 20-07-2023<br>శోభకృత్ నామ సంవత్సరము<br>ఉత్తరాయణం వర్షరుతువు<br>అధిక శ్రావణ మాసం |

**తిథి : శు. తదియ తె. 03.52**

**నక్షత్రం : ఆశ్లేష ఉ. 09.36**

**వర్జ్యం : రా. 10.56 ల 12.42**

## సైబర్ నెట్ ఛానల్ గుర్తింపు కై ఎపిఎంఎఫ్ డిమాండ్

**విజయవాడ:** అక్రిడియేషన్ జీ. వో ప్రకారం ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ లొ ప్రసారమవుతున్న ఛానెల్స్ కు అక్రేడియేషన్స్ ధరకాస్తు చేసుకొనుటకు సమాచార శాఖ వెబ్ సైట్ లో ఛానెల్స్ పేర్లు నమోదు చేయాలని బుధవారం సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ని ఆంధ్ర ప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి. డిల్లీ బాబు రెడ్డి కొరారు. ఫైబర్ నెట్ లో కొన్ని ఛానెల్స్ అక్రేదియేషన్ జీ.వో ప్రకారం ప్రసార మవుతున్న నేటికీ ఆక్రిదియేషన్స్ కొరకు దరకాస్తు చేసుకోలేక ఇబ్బంది పడుతున్నారని వెంటనే ఆన్లైన్ లో ఛానెల్స్ పేర్లు నమోదు చేయాలని కోరారు. స్పందించిన కమీషనర్ తుమ్మ విజయ కుమార్ రెడ్డి ఈ విషయాన్ని జాయింట్ డైరెక్టర్ కస్తూరి కి.చెప్పి వెంటనే చూడమని చెప్పారు. జాయింట్ డైరెక్టర్ కస్తూరి ఫైబర్ నెట్ ఆఫీస్ కి ఫోన్ చేసి వెంటనే ఫైబర్ నెట్ లో ప్రసారమవుతున్న ఛానెల్స్ లిస్ట్ పంపమని జి. ఎమ్. భాస్కర్ రెడ్డి ని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ మీడియా ఫెడరేషన్ నాయకులు డిల్లి బాబు రెడ్డీ చొరవతో ఛానెల్స్ సమస్య పరిష్కారం కానుందని పలువురు ఛానెల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ. పి. ఎమ్ ఎఫ్ నాయకులు వల్లూరు ప్రసాద్ కుమార్, అప్పాజీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ - 8,600 మంది అభ్యర్థుల రాక



విజయనగరం: నగరంలోని జూలై 20 నుంచి ఆగష్టు 2వ తేదీ వరకు అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణకు జిల్లా యంత్రాంగం, ఆర్మీ అధికారులతో కలసి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి ఎస్ వెల్లడించారు. శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు సుమారు 8,600 మంది అభ్యర్థులు పద్నాలుగు రోజుల పాటు నగరంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ఈ ర్యాలీకి హాజరు కానున్నారని చెప్పారు. ఇప్పటికే రాతపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పరుగుపందెం, లాంగ్ జంప్, ఇతర శారీరక ధారుఢ్య పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆర్మీ అధికారులు తుది ఎంపికలు చేస్తారని పేర్కొన్నారు. రిక్రూట్మెంట్ ర్యాలీ తొలిరోజున 970 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని జిల్లా కలెక్టర్ చెప్పారు. నగరంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో రిక్రూట్మెంట్ ర్యాలీకి చేసిన ఏర్పాట్లను బుధవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్మీ రిక్రూటింగ్ అధికారి జి.ఎస్.రణ్ధావా, వినయ్ కుమార్లతో కలసి పరిశీలించారు. పరుగుపందెం నిర్వహణకు మైదానంలో చేసిన ఏర్పాట్లు, బారికేడ్ల ఏర్పాటు, విద్యుద్దీపాలు ఏర్పాట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల ఏర్పాటు, ఎంపికల సందర్భంగా అస్వస్థతకు గురైన అభ్యర్థులకు అత్యవసర వైద్య సహాయం, బస్టాండు, రైల్వే స్టేషన్ నుంచి అభ్యర్థులకు రవాణా ఏర్పాట్లు, వర్షాలు కురిసినట్లయితే పరుగుపందెం నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రదేశాల గుర్తింపు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు రిక్రూట్మెంట్ జరిగే ప్రదేశానికి చేరుకునే విధంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. వేదిక వద్దకు చేరుకున్న వెంటనే అభ్యర్థుల ప్రవేశ పత్రాలను పరిశీలన చేసిన అనంతరం లోపలికి అనుమతిస్తారని,అభ్యర్థులకు 1.6 కిలోమీటర్ల పరుగుపందెం నిర్వహిస్తారని తెలిపారు. ఆర్మీ ప్రమాణాల ప్రకారం ఈ పరుగుపందెంలో ఎంపికైన వారికి లాంగ్ జంప్, మరికొన్ని శరీర ధారుఢ్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం విద్యార్థుల ధృవపత్రాల పరిశీలన వుంటుందన్నారు. రాత్రింబవళ్లు ఇక్కడ రిక్రూట్మెంట్ జరుగుతున్నందున నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేశామన్నారు. వర్షం కురిసినా రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణకు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. వైద్య సహాయం అందించేందుకు రెండు అంబులెన్స్లు, ఇద్దరు వైద్యులు, సహాయక సిబ్బందిని సిద్ధంగా వుంచతున్నట్టు చెప్పారు. ఆర్మీ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు అల్పాహారం, భోజన వసతులు కూడా సమకూరుస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంత అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆర్మీకి అధిక సంఖ్యలో ఎంపికవుతారని ఆశిస్తున్నట్టు కలెక్టర్ చెప్పారు.

కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ ఆర్. శ్రీరాములు నాయుడు, డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణచక్రవర్తి, సెట్విజ్ సి.ఇ.ఓ. రాంగోపాల్, రోడ్లు భవనాల శాఖ ఇ.ఇ. వెంకటరమణ, డి.ఇ. శ్రీనివాస్, ఇ.పి.డి.సి.ఎల్. అధికారులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్

గురువారం 20-07-2023

# అన్నదానం యొక్క మహిమ!

అన్నం పరబ్రహ్మ స్వరూపం...!!

ప్రతి మనిషికి పంచ కోశములు అని అయిదు కోశములు ఉంటాయి.

అవి..!!

1) అన్నమయ, 2) ప్రాణమయ, 3) మనోమయ, 4) విజ్ఞానమయ, 5) ఆనందమయ కోశములు..

అన్నమయ కోశము స్థూల శరీరానికి సంబందించినది.

ఈ అన్నమయ కోశములో ప్రవేశించే అన్నము ప్రాణ శక్తిగా మారుతున్నది.

కనుక అన్నమయ కోశాములోనికి వెళ్ళే ఆహారమే అన్నము అని అర్థం.

అన్నమే అన్నకోశములో ప్రవేశించి ప్రాణంగా మారుతున్నందు వలన అన్నదానం అంటే ప్రాణాన్ని దానం చేయడమే.

అంతే కాదు ఒక ప్రాణం నిలవడానికి కావలసినది అన్నమే.

కనుక అన్నదానం చేయడం శ్రేష్టం అని శాస్త్రాలు చెప్తున్నాయి.

ఏదైనా దానం చేసేప్పుడు విచక్షణ అవసరం కానీ అన్నదానానికి మాత్రం ఈ నియమం లేదు.

ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం అంటే వాళ్ళ ప్రాణాన్ని నిలపడమే కనుక అది అత్యంత శ్రేష్టం అయినది.

**చిన్న కథ..!!**

పూర్వకాలంలో ఒక బ్రాహ్మణుడు కాశీ యాత్రకు బయలుదేరాడు.

ఆరోజుల్లో ప్రయాణ సాధనాలు, సరైన రహదారి వ్యవస్థ ఇంతగా లేనందున కాశీ చేరడానికి వారున్న ప్రాంతాలను బట్టి కొన్ని నెలలు ప్రయాణించాల్సి వచ్చేది...

యాత్రికులు దారి మధ్యలో రాత్రుళ్ల గ్రామాల్లో బస చేస్తూ వెళ్లేవారు.

ఈ బ్రాహ్మణుడు ఏదో ఆలస్యం కారణంగా చీకటి పడే సమయానికి తాను వెళ్లవలసిన గ్రామానికి చేరుకో లేకపోయాడు.

చీకటి పడింది, ఏమి చేయాలో తోచలేదు.

అయితే అదృష్టవశాత్తు ఒక కోయవారి ఇల్లు కనబడింది, అక్కడ ఆశ్రయం కోరాడు.

శంబరుడు అనే ఆ కోయవాడు ఆశ్రయం ఇవ్వడానికి ఒప్పుకొని తన వద్ద ఉన్న వెదురు బియ్యం, తేనె తినడానికి ఇచ్చాడు.

తన కుటీరం చిన్నదైనందున దానిలో పడుకోమని, తాను బయట కాపలాగా ఉంటానన్నాడు.

ఆ అర్ధరాత్రి ఒక పులి శంబరుడుపై అదను చూసి దాడి చేసి, చంపివేసి, దేహాన్ని తీసుకుపోయింది.

బ్రాహ్మణుడు బిక్కచచ్చిపోయాడు, కోయవాని మరణానికి చింతించి, తన దారిన తాను వెళ్లాడు, కాశీ చేరాడు... దైవ దర్శనం చేసుకున్నాడు.

ఈ బ్రాహ్మణునికి ఎప్పటి నుంచో అన్నదానం అంత గొప్పదా అన్న అనుమానం ఉండేది.

తన ఇష్ట దైవమైన విశ్వేశ్వరుడు ఆ సందేహం తీరిస్తే బావుండునని అనుకున్నాడు.

ఆరోజు రాత్రి కాశీ విశ్వేశ్వరుడు అతనికి కలలో కనిపించి, నువ్వు తిరుగు ప్రయాణంలో ఒక రాజ్యం మీదుగా వెడతావు.

అక్కడి రాజుకు ఒక పుత్రుడు జన్మించి ఉంటాడు.

ఆ శిశువును ఏకాంతంగా ఆశీర్వదించు అని చెప్పాడు, ఎందుకో చెప్పలేదు!!...

బ్రాహ్మణుడు అలాగే చేశాడు!!...

రాజకుమారుణ్ణి ఏకాంతంగా ఆశీర్వదించేందుకు వెళ్లాడు.

చంటి పిల్లవాడైన ఆ రాజకుమారుడు, ఈ బ్రాహ్మణుణ్ణి చూసి నవ్వి..

ఓయీ బ్రాహ్మణా... నన్ను గుర్తుపట్టావా... నేను కోయవాణ్ణి... నీకు ఒక్క రాత్రి అన్నదానం చేయడం వల్ల ఈ జన్మలో నాకు రాజయోగం సిద్ధించింది అన్నాడు!!...

మరు క్షణం అతనికి మళ్లీ పూర్వజన్మ జ్ఞానం నశించి మామూలు శిశువుల మాదిరి ఆడుకోవడం మొదలెట్టాడు. బ్రాహ్మణుని సంశయం తీరింది... ఇదీ అన్నదాన మహిమ.

# రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. బుధవారం నర్సీపట్నం మున్సిపాలిటీ 8వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వలంటరీ, సచివాలయ వ్యవస్థ పని చేస్తుందన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీలోని అన్ని వార్డులను సమాన ప్రాదిపదికన అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు పొందుతున్న వారంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్లు జగదీశ్వరి, శిరసపల్లి నాని, మాకిరెడ్డి బుల్లిదొర, కోఆప్షన్ మెంబర్లు ఎండి.భాష, షేక్ రోజా, వైసిపి పట్టణ అధ్యక్షులు ఏకా శివ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ చోటి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు బీవ పాల్గొన్నారు.

# ఈ నెల 21 నుండి నర్సీపట్నం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం మున్సిపాలిటీ మెయిన్ రోడ్ విస్తరణ పనులపై నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ బుధవారం ఆర్డీవో జయరాంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈరోజు రెవెన్యూ పోలీసు మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నెల 21న శుక్రవారం ఉదయం 10:45 నుండి అబీద్ సెంటర్ నుండి పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. మొదట ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన ఆక్రమణలు తొలగించడం జరుగుతుందన్నారు. అలాగే టిడిఆర్ బాండ్లకు అంగీకరించిన వ్యాపారస్తులు బిల్డింగులు తొలగించడం జరుగుతుందని ఆయన తెలిపారు. స్థానిక వ్యాపారస్తులతో మాట్లాడి ఎవరికైతే నగదు కావాలని అడుగుతున్నారో వాళ్లకి నగదు రూపంలో ఇచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.60కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ రోడ్డు విస్తరణను అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కనకారావు, నర్సీపట్నం టౌన్ సిఐ ఎన్.గణేష్, నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు ఏకా శివ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష కార్యక్రమం ఒక వరం

## నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** జగనన్న సురక్ష కార్యక్రమం ఒక వరమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. బుధవారం నర్సీపట్నం మున్సిపాలిటీ 8వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం చేతుల మీదుగా ధృవపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 11 రకాల ధృవపత్రాల మంజూరుతో పాటు అర్హత ఉండి ఎవరికైనా సమస్యల వల్ల పథకాలు అందకుంటే సమస్యలు పరిష్కరించి పథకాలు వర్తించేలా చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఆర్డీవో జయరాం మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అర్జీదారులకు జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధృవీకరణ పత్రాలు ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, జగనన్న సచివాలయల కన్వీనర్ తమరాన శ్రీను, మున్సిపల్ కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, మాకిరెడ్డి బుల్లిదొర, శిరసపల్లి నాని, చినబాబు, కోఆప్షన్ కౌన్సిలర్ షేక్ రోజా, ఎండి.భాష, వైసిపి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయి ప్రజా అవగాహన తోనే ప్రమాదాలు నివారణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** క్షేత్ర స్థాయి ప్రజా అవగాహన తోనే ప్రమాదాలు నివారణ సాధ్య పడుతుందని భీమిలి భీమిలి ఆర్డీవో ఎస్. భాస్కర్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం భీమిలి ఆర్డీవో కార్యాలయంలో కర్మాగారాల తనిఖీ శాఖ ఆధ్వర్యంలో ఆర్డీవో ఎస్. భాస్కర్ రెడ్డి అధ్యక్షతన లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల నిర్వాహకులు ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి అని సూచించారు. ప్రమాదాలు సంభవించే పరిశ్రమలను ముందుగానే గుర్తుంచి భద్రత కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తమ రెవిన్యూ డివిజన్ పరిధిలోని పరిశ్రమల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. కార్మికులు, ప్రజలు భద్రత కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆన్ సైట్, ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ ను అమలు చేయాలన్నారు. పరిశ్రమల పరిధిలోని గ్రామాల ప్రజలను, వారి సంక్షేమాన్ని, భద్రతను దృష్టిలో ఉంచుకొని పరిశ్రమలు నిర్వహించాలన్నారు.

జాయింట్ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిభందనలు పాటిస్తూ తమ శాఖ ఆధ్వర్యంలో ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. నిత్యం ఆయా పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ V. సురేష్ మాట్లాడుతూ తాము ముందుగానే తయారు చేసుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ఆయా పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించి, భద్రతా లోపాలు ఉంటే గుర్తించి, సరిచేసిన అనంతరం నిర్వహణకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పైడి చిన్నారావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాక్ట్ ప్రకారం ఆయా పరిశ్రమల నిర్వహణ, భద్రత పై ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు.

ఈ కార్యక్రమం లో డాక్టర్ కళ్యాణ్ ప్రసాద్, దివిస్ లేబ్రటరీ, స్ప్రింట్ ఎక్స్పోర్ట్స్, ఎవర్ బ్లూ శీ ఫుడ్స్, అబాడ్ ఓవర్సీస్, ఘన్ మెరైన్ ప్రొడక్ట్స్, నాగ హనుమాన్ ఫిష్ ప్యాకెర్స్, SMSEA మెరైన్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వల్లికంటిడేవిడ్‌సేవలను గుర్తించి చంద్రబాబు పంపించిన అభినందన లేఖను అందించిన టీడిపి నాయకులు



తెలుగుదేశం పార్టీ తిరువూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియాలో యాక్టివ్ గా పని చేస్తూ తిరువూరు నియోజకవర్గంలో 2 ప్లేస్ లో ఉన్న పెద్దవరం గ్రామానికి చెందిన పల్లికంటి డేవిడ్ ను అతను పార్టీకి చేస్తున్న పనితీరును గుర్తించి తెలుగుదేశం పార్టీ స్టేట్ పార్టీ ఆఫీస్ నుంచి మాన్య మాజీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు నుంచి వచ్చిన అభినందన లేఖను తిరువూరు నియోజకవర్గ ఇంచార్జ్ శావల దేవదత్, మాజీ శాసనసభ్యులు నల్లగట్ల స్వామి దాసు, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వాసం మునియ, మండల పార్టీ అధ్యక్షులు వెదురు వెంకట నర్సిరెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు బొమ్మసాని ఉమా మహేష్, తిరువూరు నియోజకవర్గ పార్టీ ఆఫీసులో అభినందించి పార్టీ నుంచి వచ్చిన సర్టిఫికెట్ను అందజేయడం జరిగింది.

# ఖచ్చితమైన ఓటర్లజాబితా తయారీకి పార్టీలు సహకరించాలి



**విజయనగరం:** ఖచ్చితమైన వివరాలతో స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు తమవంతు సహకారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా, కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నెల 21 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని చెప్పారు. నెలరోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతీ ఇంటికీ వెళ్లి, ఓటర్ల వివరాలను తనిఖీ చేస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, లేని ఓటర్ల పేర్లు తొలగించడంతోపాటు, అడ్రస్, డోర్ నెంబరు తదితర వివరాలను కూడా ఓటర్ల జాబితాల్లో సరిచేస్తారని చెప్పారు. ఈ ప్రక్రియ ఖచ్చితంగా, సంపూర్ణంగా తయారు చేసేందుకు పార్టీల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. దీనికోసం రాజకీయ పార్టీలు తమ బూత్ ఏజెంట్ల జాబితాలను ముందే తమకు అందజేయాలని కోరారు. బిఎల్‌ఓతోపాటు, పార్టీల ఏజెంట్లు కూడా ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించడం ద్వారా సమగ్ర జాబితాలు తయారవుతాయని అన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. దీనిలో భాగంగా కళాశాలల్లో కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. వలస కార్మికులు, ట్రాన్స్ జెండర్లు, ఇళ్లులేని, స్థిర నివాసం లేని వారి వివరాలను కూడా సేకరించి ఓటుహక్కు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. డూప్లికేట్ ఓట్లను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని, వారు ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటుహక్కు కల్పించి, రెండోదాన్ని తొలగిస్తామని కలెక్టర్ చెప్పారు.

వైకాపా నాయకులు రొంగలి పోతన్న, బిజెపి నాయకులు టి.హరనాధ్, ఇమంది సుధీర్, టిడిపి నాయకులు ఐవిపి రాజు, కాంగ్రెస్ నాయకులు సరగడ రమేష్, సుంకరి సతీష్, ఆమ్ ఆద్మీ నాయకులు కోటేశ్వర్రావు, బిఎస్‌పి నాయకులు సోములు పలు సూచనలు చేశారు. తమవంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జెసి కె.మయూర్ అశోక్, డిఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఇఆర్‌ఓలు, ఎలక్షన్ సెల్ అధికారులు, ఎన్నికల డిటిలు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకం కింద ఉద్యోగ పత్రాలను అందజేసిన జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన నలుగురు ఉద్యోగుల కుటుంబీకులకు బుధవారం కాకినాడ కలెక్టరు కార్యాలయంలో కలెక్టరు డా. కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద ఆఫీస్ సబార్డినేట్స్ గా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటి ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయాలని కలెక్టరు అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసురావు ఇతర ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పొట్ట కరిగించి, బరువు తగ్గడానికి క్యారెట్ జ్యూస్



ఈ బిజీ జీవితంలో, మనం ఎల్లప్పుడూ మన ఆరోగ్యాన్ని విస్మరిస్తాము. ఇలా చేయడం వల్ల అనేక రకాల సమస్యలు వస్తాయి. బరువు పెరగడం అనేది ఒక సాధారణ సమస్యగా మారింది. బరువు తగ్గడానికి, డైటీషియన్లు మరియు నిపుణులు వివిధ రకాల వ్యాయామాలు, ఆహార ప్రణాళికలు మరియు ఏమి చేయాలి మరియు ఏమి చేయకూడదు అనే పూర్తి జాబితాను అందిస్తారు. అయితే, టైట్ వర్క్ షెడ్యూల్‌లో ఇవన్నీ అనుసరించడం కొంచెం కష్టంగా మారుతుంది. చివరకు త్వరగా బరువు తగ్గాలంటే ఏం చేయాలో అర్థం కావడం లేదు.

కానీ మీరు బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నట్లయితే, క్యారెట్ రసం మీకు గొప్ప ఎంపిక. క్యారెట్ జ్యూస్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ రోజు మనం దాని యొక్క అనేక ప్రయోజనాల గురించి చెప్పబోతున్నాం. క్యారెట్ జ్యూస్ బరువు తగ్గడానికి దివ్యౌషధం మరియు ఈ రసాన్ని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల కంటి చూపు కూడా మెరుగుపడుతుంది. క్యారెట్‌లో ఉండే డైటరీ ఫైబర్‌కు ఆకలిని నియంత్రించే శక్తి ఉంది. దీని రసం తాగడం వల్ల జీర్ణశక్తి బలపడుతుంది. ఇది మనల్ని అనేక వ్యాధులకు దూరంగా ఉంచి ఆరోగ్యంగా ఉంచుతుంది.

**క్యారెట్ రసం పోషకాలు:** క్యారెట్ జ్యూస్‌లో తగినంత ఫైబర్ ఉంటుంది. విటమిన్ ఎ, కెరోటిన్, బీటా మరియు యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఇందులో ఉంటాయి. ఇది కాకుండా, క్యారెట్ రసం విటమిన్లు A, C, K, B8, ఇనుము యొక్క మంచి మూలంగా పరిగణించబడుతుంది. క్యారెట్ జ్యూస్‌ని రెగ్యులర్‌గా తాగడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

**క్యారెట్ రసం బరువును ఎలా తగ్గిస్తుంది**

**క్యారెట్ ఫైబర్ యొక్క మంచి మూలం**

క్యారెట్ జ్యూస్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది చాలా కాలం పాటు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఎక్కువసేపు కడుపు నిండుగా అనిపించడం వల్ల అదనపు ఆహారం కోసం కోరిక తగ్గుతుంది. అలాగే, మీరు అతిగా తినడం నివారించండి. ఇది బరువును నియంత్రించడంలో సహాయపడుతుంది.

**క్యారెట్‌లో విటమిన్ ఎ లభిస్తుంది:** క్యారెట్ జ్యూస్‌లో విటమిన్ ఎ కూడా పుష్కలంగా ఉంటుంది, ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మీరు ఉదయాన్నే ఖాళీ కడుపుతో క్యారెట్ జ్యూస్ తీసుకుంటే, వ్యాయామం చేసేటప్పుడు శరీరానికి అదనపు శక్తి లభిస్తుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది** : క్యారెట్ జ్యూస్‌లో ఉండే విటమిన్-సి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. క్యారెట్లు విటమిన్ సి యొక్క మంచి మూలంగా పరిగణించబడతాయి. బరువు తగ్గడానికి విటమిన్ సి చాలా ముఖ్యమైనదిగా పరిగణించబడుతుంది.

**బరువు తగ్గించడంతో పాటు చర్మానికి కూడా మేలు చేస్తుంది** : క్యారెట్ మన చర్మానికి కూడా చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది ఎందుకంటే ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరానికి అనేక ప్రయోజనాలను అందించడంలో చాలా ప్రభావవంతంగా పరిగణించబడతాయి. రోజూ క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

**క్యారెట్ యాంటీఆక్సిడెంట్ల మూలం** : క్యారెట్ రసం శరీరంలో యాంటీఆక్సిడెంట్ల ప్రభావాన్ని పెంచుతుంది మరియు లిపిడ్ పెరాక్సిడేషన్ (శరీరంలోని లిపిడ్లపై ఫ్రీ రాడికల్స్ ప్రభావం) తగ్గిస్తుంది. క్యారెట్ జ్యూస్ రెగ్యులర్ గా తాగడం వల్ల బరువు తగ్గుతారు.

**ఈ విధంగా బరువు తగ్గించే పానీయం సిద్ధం చేయండి** : రసం చేయడానికి, క్యారెట్లను చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి. క్యారెట్‌ను మధ్య నుండి కోసి దాని పసుపు భాగాన్ని తీసివేసి, మిగిలిన క్యారెట్‌ను చిన్న ముక్కలుగా కట్ చేయాలి. ఇప్పుడు బీట్‌రూట్‌ను కడిగి, తొక్క తీసి, పొడవాటి మరియు సన్నని ముక్కలుగా కట్ చేసుకోండి. ఒక పెద్ద గాజు పాత్రలో 3 లీటర్ల నీరు తీసుకుని, అందులో క్యారెట్ ముక్కలు, బీట్‌రూట్, 1 టీస్పూన్ ఉప్పు, 1 టీస్పూన్ నల్ల ఉప్పు, 1 టీస్పూన్ ఎర్ర మిరపకాయ మరియు 2 టీస్పూన్ల మెత్తగా రుబ్బిన ఆవాలు వేసి బాగా కలపాలి.

ఇప్పుడు ఈ కూజాను సన్నని గుడ్డతో కప్పి, చక్కటి రంధ్రాలతో మూత పెట్టండి. 4 నుండి 5 రోజులు రోజుకు ఒకసారి ఒక చెంచాతో ప్రతిరోజూ ఈ పానీయాన్ని కదిలించండి. మీరు ఈ కూజాను 2 నుండి 3 రోజులు ఎండలో ఉంచవచ్చు, తద్వారా పానీయం బాగా కలిసిపోతుంది. మీ రుచికరమైన మరియు ఆరోగ్యకరమైన క్యారెట్ మరియు బీట్‌రూట్ (క్యారెట్ జ్యూస్ బెనిఫిట్స్) జ్యూస్ సిద్ధంగా ఉంది! తర్వాత దీన్ని రోజూ తీసుకోవచ్చు. ఇలా తీసుకోవడానికి ఇష్టం లేని వారు ఫ్రెష్ జ్యూస్ కూడా తీసుకోవచ్చు.

**బరువు తగ్గడానికి క్యారెట్ జ్యూస్ ఎప్పుడు తీసుకోవాలి** : క్యారెట్ రసం శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉంటుంది, కాబట్టి ఇది ఎల్లప్పుడూ ఉదయం అల్పాహారం లేదా భోజనం తర్వాత తినడానికి సిఫార్సు చేయబడింది. అల్పాహారంలో క్యారెట్ జ్యూస్ తీసుకోవడం బరువు తగ్గడానికి ఉత్తమమైనదిగా పరిగణించబడుతుంది. బరువు తగ్గడానికి లేదా ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రిపూట క్యారెట్ జ్యూస్ తీసుకోకండి.

# చాక్లెట్లు తింటే మొటిమలు వస్తాయా?



అందంగా కనిపించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. దీనికి పురుషులకు, స్త్రీలు అనే తేడా అవసరం లేదు. మంచి ముఖం, ఆరోగ్యవంతమైన చర్మం, అందంగా, ఆకట్టుకునేలా, ముఖం కళగా కనిపించాలని అందరూ కోరుకుంటారు. అందు కోసం రకరకాల క్రీములు, లోషన్లు, ఫేస్ మాస్కులు కూడా వాడుతుంటారు. మహిళలు మరింత ఎక్కువగా వివిధ రకాల ఉత్పత్తులు వాడుతుంటారు.

కొందరు ఖరీదైన క్రీములు వాడితేనే అందంగా కనిపిస్తారని, నాసిరకమైన ఉత్పత్తులకు అందం రాదని అంటారు.. అలాగే ముఖం మురికిగా ఉండటం వల్లే మొటిమలు వస్తాయంటారు.. ఇలాంటి చాలా మంది నమ్ముతుంటారు. మరి అసలు నిజాలేనా లేదా అపోహలా అనేది ఇప్పుడు తెలుసుకుందాం.

1. ఖరీదైన క్రీములే వాడాలి, అప్పుడే స్కిన్ 'యంగ్'గా ఉంటుంది! ఖరీదైన క్రీములే వాడాలని చాలా మంది అనుకుంటారు. మరికొంది అయితే ఖరీదైన క్రీములు వాడితేనే ముఖం అందంగా కనిపిస్తుందని, స్కిన్ యంగ్‌గా ఉంటుందని కూడా అంటారు. అయితే ఎంత ఖరీదైన క్రీములు వాడినప్పటికీ ముఖం చర్మం వయస్సు తగ్గించడం సాధ్యం కాదు. అది కేవలం స్కిన్ క్రీము పరిశ్రమల మార్కెటింగ్ జిమ్మిక్కు మాత్రమే అంటున్నారు వైద్యులు. సమతుల్యమైన ఆహారం, చర్మ రక్షణ పద్ధతుల ద్వారా కొంత వరకు అందాన్ని కాపాడుకోవచ్చు. కానీ స్కిన్ వయస్సును తగ్గించుకోలేం. అలాగే ఖరీదైన వాటినే వాడాలన్నది కూడా కరెక్టు కాదు. అయితే ఉత్పత్తులు తీసుకునే ముందు అందులో ఏయే మోతాదులో రసాయనాలు వాడారో చూసుకోవడం కీలకం.

2. నీరు తాగితే చర్మాన్ని హైడ్రేట్ గా ఉంచుకోవచ్చు! ఇది కూడా పూర్తిగా నిజం కాదని అంటున్నారు వైద్య నిపుణులు. చర్మం శరీరంలోని అతిపెద్ద అవయవం. శరీరం అంతటిని కాపాడే కవచం. దుమ్ము ధూళి నుంచి, సూర్యరశ్మి నుంచి చర్మమే రక్షణ కల్పిస్తుంది. అయితే హీట్ స్ట్రోక్, తీవ్ర డీహైడ్రేషన్ వంటి విపరీతమైన సందర్భాల్లో తప్ప తాగు నీరు చర్మాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని వైద్యులు చెబుతున్నారు.

**3. యాంటీ బ్యాక్టీరియల్ సోప్ చర్మానికి ఉత్తమం!** ఇది కేవలం అపోహ మాత్రమే. చర్మం యొక్క సహజ మైక్రోబయోమ్ ఆరోగ్యకరమైన చర్మాన్ని నిర్వహించడానికి చాలా ముఖ్యమైనది. యాంటీ బ్యాక్టీరియల్ సబ్బులను ఉపయోగించడం వల్ల ఆ సహజ సమతుల్యత దెబ్బతింటుంది అని చర్మ సంబంధిత నిపుణులు చెబుతున్నారు. అవి న్యూట్రల్ సబ్బుల కంటే చర్మంపై కఠినంగా ఉంటాయని అంటున్నారు. బ్యాక్టీరియాలో మంచివి, చెడువి ఉంటాయి. మంచి బ్యాక్టీరియాను కూడా తొలగించడం వల్ల నష్టమే తప్ప లాభం ఏమీ ఉండదని చెబుతున్నారు.

4. చాక్లెట్లు తింటే మొటిమలు వస్తాయని నమ్మడం అపోహ. చాక్లెట్లు తినడం వల్ల మొటిమలు వస్తాయన్నది ఎక్కడా నిరూపితం కాలేదని వైద్యులు చెబుతున్నారు.

5. సూర్యరశ్మి చర్మానికి హానికరం! సూర్యరశ్మి వల్లే విటమిన్ డి అందుతుంది. ఇది ఎముక ఆరోగ్యానికి ముఖ్యం, రోగనిరోధక వ్యవస్థలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అయితే సూర్యుని యూవీ కిరణాల వల్ల చర్మానికి హాని జరుగుతుంది అనేది మాత్రం నిజం. అందుకే సూర్యోదయం సమయంలో లేదా సూర్యాస్తమయం సమయంలో లేలేత కిరణాలు మంచివని వైద్యులు చెబుతున్నారు.

# నిద్ర లేవగానే నీళ్లు తాగే వారికి షాకింగ్ న్యూస్..



మనల్ని మనం ఆరోగ్యపరంగా జాగ్రత్తగా ఉంచుకోవాలని చాలా మంది కోరుకుంటూ ఉంటారు. అయితే అధికంగా నీటిని తాగితే జీర్ణ క్రియతో పాటు వివిధ సమస్యలు దూరం అవుతాయని చాలా మంది చెబుతూ ఉంటారు. ముఖ్యంగా ఉదయాన్నే లేచి నీరు తాగడం సుఖ విరోచనం అవ్వడంతో పాటు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని చాలా మంది నిపుణులు చెబుతూ ఉంటారు. వారి సూచనలకు అనుగుణంగా చాలామంది ఉదయాన్నే లేవగానే నీరు తాగడం అలవాటు చేసుకున్నారు. అయితే తాజాగా ఆరోగ్య నిపుణులు ఓ షాకింగ్ విషయం వెల్లడిం చారు. ఉదయాన్నే లేచిన వెంటనే నీరు తాగితే అనేక ఆరోగ్య సమస్యలకు కారణం అవుతుందని వెల్లడించారు. ముఖ్యంగా శరీర జీవక్రియకు చాలా నష్టం చేస్తుందని పేర్కొంటున్నారు. ఆయుర్వేద వైద్యులు ఉదయాన్నే నీటిని తాగే బదులుగా ఉష్ణపన్ అనే విధానాన్ని పాటించాలని సూచిస్తున్నారు.

చాలా మంది ఉదయాన్నే లేవగానే ఎక్కువగా నీరు తాగేస్తూ ఉంటారు. అయితే ఇలా చేస్తే జీవక్రియకు చాలా కీడు చేసినట్టేనని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇలా చేయడం వల్ల కాలేయ పనితీరు బాగా దెబ్బతింటుంది. అంతేకాదు మూత్రపిండాలతో పాటు మెదడు కణాలపై ఒత్తిడి కలిగిస్తుంది. ముఖ్యంగా మెదడు కాండంపై తీవ్ర ప్రభావం చూపి కేంద్ర నాడీ వ్యవస్థకు చేటు చేస్తుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఉదయాన్నే లేవగానే ఓ చిన్న గ్లాసు గోరువెచ్చని నీరు తాగాలని సూచిస్తున్నారు. నీటిని ఎక్కువ తాగడం వల్ల మంచిదే అయినా ఉదయాన్నే తాగకూడదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే ఒక్కోసారి దాహం వల్ల మెలకువ వస్తుందని, ఆ సమయంలో నీరు తాగితే పర్లేదని సూచిస్తున్నారు. అలాగే నీటిని ఎలా తాగాలో కూడా చెబుతున్నారు. వారు సూచించే మార్గాలను తెలుసుకుందాం.

**నీటిని ఇలా తాగితే మేలు** : చాలా మంది నిలబడి నీరు తాగుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల మూత్రపిండాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాగే ఆర్థ్రైటిస్ సమస్య కూడా వేధించే అవకాశం ఉంది. సాధారణంగా నిలబడి నీరు తాగడం వల్ల నరాలు ఉద్రిక్తతకు లోనవుతాయి. కాబట్టి కూర్చొని నీరు తాగడం శ్రేయస్కరమని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ముఖ్యంగా మద్యపానం సమయంలో కూడా కచ్చితంగా కూర్చొనే తాగాలని పేర్కొంటున్నారు. అలాగే కూలింగ్ వాటర్‌ను వీలైనంత తక్కువ తీసుకోవాలి. రూమ్ టెంపరేచర్ నీటిని తీసుకోవడం మంచిది. ముఖ్యంగా ఉదయం సమయంలో తప్పనిసరిగా నీళ్లు తాగాల్సి వస్తే కూలింగ్ వాటర్‌ను దూరం పెడితే మంచిది.

# రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నారా.. చింత ఎలా కరివేపాకు ఉందిగా అండగా..



భారతీయ వంటకాల్లో సుగంధ ద్రవ్యాలు ముఖ్యపాత్ర వహిస్తాయి. ఇవి ఆహారానికి రుచి, వాసనను అందిస్తాయి. అంతేకాకుండా అనేక ఆరోగ్య లక్షణాలు కలిగి ఉంటాయి. కరివేపాకును అనేక రకాల వంటలలో ఉపయోగిస్తారు. దీనిని వంటల్లో వేయడం వల్ల మంచి సువాసన, రుచి పెరుగుతుంది. ఇది వంటలకు కొత్తరూపు తీసుకువస్తుంది.

కరివేపాకు నూనె.. ఒరేగానో ఆయిల్, బాసిల్ ఆయిల్ వంటి ఇతర హెర్బ్ ఆయిల్‌ల వలె కరివేపాకు ఆయిల్ కూడా ప్రసిద్ధి చెందింది. ఇది మీ వంటకాలకు తాజా వాసన, రుచిని అందిస్తుంది. అదనంగా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. విరేచనాలు, మలబద్ధకం, వంటి కడుపు సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

కరివేపాకులో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తహీనతను దూరం చేస్తుంది. ఈ నూనెను ఉపయోగించడం వల్ల జుట్టు వేగంగా పెరుగుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. తాజా కరివేపాకు ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మధుమేహం అదుపుల ఉంటుంది. బరువు తగ్గడంలో కూడా తోడ్పడుతుంది.

కరివేపాకు నూనెను ఎలా ఉపయోగించాలి.. ఆహారంలో రుచి, వాసన కోసం వంట నూనెలో మూలికలను కలుపుతారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. కరివేపాకు నూనెను ఉపయోగించడం వల్ల మీ రెగ్యులర్ భోజనం మరింత రుచికరంగా, ఆరోగ్యంగా ఉంటుంది.

ఇంట్లో కరివేపాకు నూనె ఎలా తయారు చేయాలి? కరివేపాకు నూనె ప్రాథమికంగా ఏదైనా నూనెతో తాజా కరివేపాకు ఆకులను కలిపి తయారు చేయవచ్చు. సంప్రదాయకంగా మీరు వర్జిన్ కొబ్బరి నూనె, తాజా కరివేపాకు ఆకులను కలపడం ద్వారా ఈ నూనెను తయారు చేయవచ్చు.

మీరు ఈ నూనెను ఫిల్టర్ చేయవచ్చు లేదా మిశ్రమ నూనెను ఉపయోగించవచ్చు. మీరు దానిని ఒక గ్లాస్ కంటైనర్‌లో ఉంచి ఎప్పుడైనా ఉపయోగించవచ్చు.

# కళ్లు ఎర్రగా మారి ఉబ్బిపోయాయా?



వర్షాకాలంలో గాలిలో తేమ పెరుగుతుంది. ఈ సీజన్‌లో ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అయితే, ఇన్ఫెక్షన్ జలుబు, జ్వరం, విరేచనాలకు మాత్రమే పరిమితం కాదు. ఈ వర్షాకాలంలో వచ్చే సమస్యల్లో కండ్లకలక కూడా ఒకటి. ఈ వ్యాధిని జైబంగ్లా అని కూడా అంటారు. ఈ కాలం రాగానే చాలా మంది ఈ వ్యాధి బారిన పడుతుంటారు. వైద్యుల ప్రకారం.. వర్షాకాలంలో చాలా వైరల్, జెర్మ్స్ గాలిలో తిరుగుతాయి. కండ్లకలక, ఇతర వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. కండ్లకలక కూడా బ్యాక్టీరియా లేదా వైరల్ ఇన్ఫెక్షన్. ఈ సమస్య కళ్ళలో సంభవిస్తుంది.

కండ్లకలక ప్రభావితమైనప్పుడు కళ్లు ఎర్రబడడం, మంటగా మారడం, కళ్లలో నీరు రావడం, కళ్లలో నొప్పి వంటి అనేక లక్షణాలు కనిపిస్తాయి. చాలా సందర్భాలలో కండ్లకలక వలన కళ్ళు ఎర్రగా, వాపుగా మారుతాయి. నొప్పి, నీళ్ళు కళ్లలో ఉంటాయి. ఈ వ్యాధిని గుర్తించి సకాలంలో చికిత్స చేయించుకోకపోతే తర్వాత కంటి కార్నియా కూడా దెబ్బతింటుంది.

చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా కండ్లకలక రావచ్చు. ఈ వ్యాధి ప్రధానంగా అంటువ్యాధి. ఈ సమస్యతో బాధపడుతున్నట్లయితే మీరు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి.

కళ్లను తరచుగా తాకవద్దు. దీనివల్ల ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. కళ్లకు మందు వేసేటప్పుడు మాత్రమే కళ్లను తాకండి. అలాగే, మీ కళ్ళను తాకడానికి ముందు మీ చేతులను సబ్బుతో బాగా కడగాలి. పరిశుభ్రత పాటించడం ద్వారా సమస్య సులభంగా నయం చేయవచ్చు.

ప్రతిచోటా ఈ శుభ్రత పాటించాలి. అంటే పేషెంట్ ఉపయోగించే టవల్స్, టవల్స్, బెడ్ షీట్లు, దిండు కవర్లు, బట్టలు, గ్లాసెస్ మొదలైనవన్నీ శుభ్రంగా ఉంచాలి. అలాగే వాటిని తాకవద్దు. వీటి నుంచి కూడా వ్యాధికారక క్రిములు వ్యాప్తి చెందుతాయి.

కాలుష్యానికి దూరంగా ఉండండి. ఈ సమయంలో కళ్ల సంరక్షణ చాలా ముఖ్యం. దుమ్ము ధూళికి దూరంగా ఉండటం మంచిది. మీరు ఈ అద్దాలను ఉపయోగించవచ్చు.

జైబంగ్లా ప్రారంభ లక్షణాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. కళ్లు ఎర్రబడడం, నొప్పి, వాపు, నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించండి. డాక్టర్ సలహాతో కంటి చుక్కలు లేదా ఔషధాన్ని ఉపయోగించండి.

# ఈ మూడు మసాలా దినుసులు వాడితే చాలు, వర్షాకాలం వ్యాధులు దూరం



వర్షాకాలం క్రమంగా తీవ్రత చూపిస్తోంది. భారీ వర్షాలు కొన్ని ప్రాంతాల్ని అతలాకుతలం చేస్తున్నాయి. వర్షాకాలంలో చాలా రకాల వ్యాధులు చుట్టుముట్టేస్తుంటాయి. సీజన్ మారడంతో సహజంగానే ఇమ్యూనిటీ బలహీనమౌతుంది. ఈ క్రమంలో వర్షాకాలం వ్యాధుల్నించి సంరక్షించుకునేందుకు ఏం చేయాలి, ఎలాంటి పదార్ధాలు తీసుకోవాలో తెలుసుకుందాం..

వర్షాకాలంలో సహజంగానే వివిధ రకాల వ్యాధుల భయం ఉంటుంది. సీజన్ మారడంతో ఇన్‌ఫెక్షన్లు సోకుతుంటాయి. చాలా వ్యాధుల సమస్య ఉత్పన్నమౌతుంటుంది. జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు తీవ్రమౌతుంటాయి. ఈ సమస్యల్నించి రక్షించుకోవాలంటే ముందుగా ఇమ్యూనిటీ పటిష్టపర్చుకోవాలి. ఇమ్యూనిటీ బలంగా ఉంటే ఏ విధమైన అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావు. శరీరంలో నిరోధక శక్తి పెరగాలంటే..కొన్ని మసాలా పదార్ధాలను డైట్‌లో తప్పకుండా చేర్చుకోవాలి. ఇమ్యూనిటీని పెంచేందుకు ఏం చేయాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందాం..

ఇమ్యూనిటీని పెంచేందుకు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటుంది. ఇమ్యూనిటీ పటిష్టం చేసేందుకు నల్లమిరియాలు అద్భుతంగా ఉపయోగపడతాయని వివిధ ఆయుర్వేద శాస్త్రాల్లో ఉంది. నల్లమిరియాలు రోజూ క్రమం తప్పకుండా తీసుకునే అలవాటుంటే మెటబోలిజం వృద్ధి చెందుతుంది. దగ్గు లేదా గొంతులో గరగర సమస్య ఉంటే నల్లమిరియాలు బాగా ఉపయోగపడతాయి. అటు ఇమ్యూనిటీ కూడా బలపడుతుంది. రోజూ రాత్రి వేళ నిద్రించేముందు నల్ల మిరియాల పౌడర్ కలిపిన పాలు తాగడం మంచి అలవాటుగా చెప్పవచ్చు.

ఇమ్యూనిటీని పెంచేందుకు కావల్సిన మరో పదార్ధం లవంగం. ఇది ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ సెప్టిక్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. ఇవి ఇమ్యూనిటీని పటిష్టం చేస్తాయి. వర్షకాలంలో రోజూ లవంగం వివిధ పదార్ధాలతో కలిపి తీసుకోవడం అలవాటు చేసుకుంటే గొంతులో గరగర వంటి సమస్య ఉండదు. ఇమ్యూనిటీ కూడా పటిష్టమౌతుంది.

మనిషి శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచే మరో పదార్ధం పసుపు. పసుపు ప్రతి ఇంట్లో తప్పకుండా ఉండేదే. పసుపులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు అధికంగా ఉంటాయి. శరీరాన్ని వివిధ రకాల వ్యాధుల్నించి రక్షిస్తాయి. రోజూ రాత్రి వేళ పసుపు తాగడం అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం ఆరోగ్యానికి చాలా మంచిది.

## జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణ తగదు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** బ్యాంకులను జాతీయకరణ చేసి 55 సంవత్సరాల అయిన సందర్భంగా బ్యాంకు ఉద్యోగులు పండుగ చేసుకున్నటువంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ బ్యాంకులను ప్రైవేటుకరణ చేస్తాననడం విడ్డూరంగా ఉంది అని యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకుడు కాంద్రేగుల హరికృష్ణ అన్నారు. జాతీయ బ్యాంకుల ప్రైవేటు కరణను వ్యతిరేకిస్తూ యూనియన్ బ్యాంక్ తుమ్మ పాల శాఖ వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు శరగడం శ్రీనివాస్, గిరిధర్. పవన్. సందీప్ రాజు. హారిక. కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

# డైరీ ఇవ్వాల్సిన అవసరం లేదు



సీబీఐ డైరీ వివరాలు ఇవ్వాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు జడ్జీలు స్పష్టంగా చెప్పేశారు. తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ దర్యాప్తు వివరాల డైరీ తనకు కావాలని సునీత పిటీషన్ వేశారు. ఆ పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. విచారణ మొదలైన కాసేపటికే కేసును జడ్జీలు కొట్టేశారు. అసలు సీబీఐ దర్యాప్తు డైరీ వివరాలు మీకు ఇస్తారని ఎలా అనుకున్నారంటు జడ్జీలు ఆశ్చర్యపోయారు.

నిజానికి ఆ డైరీలో ఏముంటుందో బయట వాళ్ళకి తెలిసే అవకాశం లేదు. తెలుసుకునే అవసరం కూడా లేదు. ఎందుకంటే తన డైరీలోని వివరాల ఆధారంగానే కేసు విచారణ సందర్భంగా కోర్టులో సీబీఐ లాయర్ వాదనలు వినిపిస్తారు.

ఆ వాదనలను బట్టి సీబీఐ డైరీ వివరాలను అంచనా వేసుకోవచ్చు. లేదంటే అవకాశం ఉంటే అనధికారికంగా డైరీలోని వివరాలను తెలుసుకోవచ్చంతే. అలాంటిది ఏకంగా డైరీ వివరాలను సునీత అడగటమే చాలా ఆశ్చర్యంగా ఉంది.

అసలు డైరీలోని వివరాలను తెలుసుకుని సునీత ఏం చేస్తారన్నదే ఎవరికీ అర్థం కావటంలేదు. తన తండ్రి హంతకులకు శిక్షలు పడిందా లేదా అన్నదే సునీతకు ముఖ్యం. అయితే ఆమె వైఖరి కారణంగా ఆమె మీదనే అందరిలోను అనుమానాలు పెరిగిపోతున్నాయి.

వివేకా హంతకుల్లో ముఖ్యడైన దస్తగిరి బెయిల్ మీద హ్యాపీగా బయట తిరుగుతుంటే సునీత పట్టించుకోవటం లేదు. నిజానికి దస్తగిరి బెయిల్ రద్దుచేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేయాల్సిన సునీత అసలు పట్టించుకోవటం లేదు. పైగా దస్తగిరి బెయిల్ రద్దుచేయాలని పిటీషన్ వేసిన వివేకా పీఏ కృష్ణారెడ్డి పిటీషన్ను వ్యతిరేకించారు.

ఇక్కడే సునీత వైఖరిపైన అందరిలోను అనుమానాలు పెరిగిపోతున్నాయి. ఇదే సమయంలో కడప ఎంపీ అవినాష్ రెడ్డిని ఎలాగైనా జైలుకు పంపాలని పదేపదే ప్రయత్నిస్తున్నారు. హత్యలో అవినాష్ పాత్రుందని ఇప్పటివరకు సీబీఐకి ఆధారాలు దొరకలేదు. అయినా సరే ఎంపీ జైలుకు వెళ్ళాల్సిందే అని సునీత పట్టుబట్టారు. మొత్తంమీద సునీత కోరిక నెరవేరుతుందా లేదా తెలీదు కానీ తాజాగా సీబీఐ దర్యాప్తు డైరీ వివరాలు కావాలని అడగటంతో జడ్జీలే ఆశ్చర్యపోయారు.

## పుతిన్‌ను అరెస్టు చేస్తే.. రష్యాపై యుద్ధం ప్రకటించినట్లే: దక్షిణాఫ్రికా



డర్బన్: రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను తమ దేశంలో అరెస్టు చేయడం రష్యాతో యుద్ధాన్ని ప్రకటించి నట్లేనని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోస అన్నారు. ఈ ఏడాది మార్చిలో పుతిన్‌పై అంతర్జాతీయ న్యాయస్థానం జారీ చేసిన అరెస్టు వారెంట్‌పై దక్షిణాఫ్రికాలోని ప్రతిపక్ష డెమోక్రటిక్ అలయెన్స్ అక్కడి కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ సందర్భంగా రమఫోస కోర్టుకు సమర్పించిన అఫిడవిట్ కాపీలోని విషయాలను ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది.

ఐసీసీ జారీచేసిన అరెస్ట్ వారెంట్ ఆధారంగా దక్షిణాఫ్రికాలో పుతిన్‌ను అరెస్ట్ చేస్తే ఆ దేశంతో యుద్ధం ప్రకటించినట్లేనని గతంలో రష్యా స్పష్టం చేసిన విషయాన్ని ఆయన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే, రష్యాతో యుద్ధం చేయడం దక్షిణాఫ్రికా రాజ్యాంగానికి విరుద్ధమని రమఫోస కోర్టుకు తెలిపారు. ఈ నిర్ణయం రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి నెలకొల్పాలన్న దక్షిణాఫ్రికా ప్రయత్నాలకు విఘాతం కలిగిస్తుందని చెప్పారు. మరోవైపు బ్రిక్స్ దేశాల వేదికను తమ దేశం నుంచి చైనాకు మార్చడం లేదా సమావేశాన్ని వర్చువల్‌గా నిర్వహించాలన్న తమ ప్రతిపాదనను బ్రిక్స్ దేశాలు తిరస్కరించినట్లు దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పౌల్ మషతిలే తెలిపారు.

ఆగస్టులో జొహెన్స్‌బర్గ్ వేదికగా జరిగే బ్రిక్స్ దేశాల సదస్సుకు పుతిన్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఐసీసీ సభ్య దేశంగా దక్షిణాఫ్రికా పుతిన్‌ను అరెస్టు చేయాల్సి ఉంటుంది. అయితే, దీనికి వ్యతిరేకంగా ఆ దేశం గతంలో ప్రకటన విడుదల చేసింది. గత నెలలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోస.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోపాటు, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలను కలిసి యుద్ధానికి ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు.

## తెదేపా అనకాపల్లి ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి ( విశాఖ సమాచారం)టీడీపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా వైకాపా నిరంకుశ పాలనను ప్రజలకు వివరించాలని మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. గెలుపే ధ్యేయంగా టీడీపీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 21నుండీ బూత్ ఏజెంట్లు తప్పకుండా బిఎల్ఓలతో కలిసి ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొన్నాలని కోరారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన టీడీపీ అనకాపల్లి టౌన్ ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అనకాపల్లి టౌన్‌లోని బూత్, యూనిట్ , క్లస్టర్ ఇంచార్జిలకు టెలిగ్రామ్ బాట్, మన టీడీపీ యాప్, ఐ టి డి పి, ఆర్టిఎస్ ఓటర్ వెరిఫికేషన్ లపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి జీవీఎంసీ పరిధిలోని బూత్, యూనిట్ , క్లస్టర్ ఇంచార్జిలు, టీడీపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష ద్వారా విద్యార్థులకు కుల, రాబడి సర్టిఫికెట్లు అందజేసిన ఎంపీపీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జగనన్న సురక్ష పథకాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు కోరారు.మండలంలో కుంచంగి గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం ఏర్పాటు అయిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు హాజరయ్యారు. కుల ధ్రువీకరణ పత్రాలను రాబడి ధ్రువీకరణ పత్రాలను ఎంపీపీ సూరిబాబు లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గంగాధర్, ఈఓపిఆర్డి కె ధర్మారావు, గ్రామ సర్పంచ్ పల్లెల లక్ష్మి నాగేశ్వర రావు, రొంగలివానిపాలెం గ్రామ సర్పంచ్ రొంగలి అప్పల నాయుడు, మరిపల్లి శోభ,బొడ్డు దేముడుబాబు, పల్లెల సాయి, పోలిని బుజ్జి,నారా పిన్ని ప్రసాద్, వైసిపి నాయుకులు లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అత్యంత పవర్ ఫుల్ పాస్ పోర్ట్ ఇదే!




ఒక దేశం నుంచి మరో దేశంలోకి అడుగుపెట్టాలంటే “వీసా” అనుమతి పత్రం తప్పనిసరనేది తెలిసిన విషయమే. అయితే కొన్ని దేశాల పాస్ పోర్టులు ఉంటే వారికి వీసాలతో పనిలేకుండా అనేక దేశాలు చుట్టిరావొచ్చు. ఈ క్రమంలో తాజాగా హెన్లీ పాస్ పోర్టు ఇండెక్స్ సంస్థ ప్రపంచ శక్తిమంతమైన పాస్ పోర్టుల జాబితా వెల్లడించింది.

లండన్ ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ హెన్లీ అండ్ పార్టనర్స్ ప్రతి సంవత్సరం ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన పాస్ పోర్ట్ ల ర్యాంకింగ్ ను విడుదల చేస్తుంది. ఇందులో భాగంగా తాజాగా గ్లోబల్ ర్యాంకింగ్ 2023 ఇటీవల విడుదలచేసింది. ఈ ర్యాకింగ్స్ లో... సింగపూర్ పాస్ పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్ పోర్ట్ గా అవతరించింది.

అవును... ఇప్పుడు ప్రపంచంలో అత్యంత పవర్ ఫుల్ పాస్ పోర్ట్ సింగపూర్ దేశానిదని తెలుస్తుంది. ఈ పాస్ పోర్ట్ తో ఎలాంటి వీసా లేకుండా ప్రపంచవ్యాప్తంగా సుమారు 192 దేశాలకు ప్రయాణం చేసే సదుపాయం ఉందని అంటున్నారు.

ఇదే సమయంలో జర్మనీ ఇటలీ స్పెయిన్ ఈ జాబితాలో రెండవ స్థానంలో ఉన్నాయని అంటున్నారు. ఈ దేశాల పాస్ పోర్టులు కలిగిన వారు ఎలాంటి వీసా అవసరం లేకుండా 190 దేశాలకు వెళ్లవచ్చని చెబుతున్నారు. ఇదే సమయంలో ఈ జాబితాలో జపాన్ మూడొస్థానంలో ఉందని తెలుస్తుంది. ఈదేశ పాస్ పోర్ట్ తో వీసా లేకుండా 189 దేశాలకు ప్రయాణించవచ్చట.

ఈ మూడో ప్లేస్ లో జపాన్ తో పాటు ఆస్ట్రియా ఫిన్లాండ్ ఫ్రాన్స్ లక్సెంబర్గ్ దక్షిణ కొరియా స్వీడన్ పాస్ పోర్ట్ లు కూడా ఉన్నాయని అంటున్నారు. ఇక ఈ ర్యాంకింగ్స్ లో డెన్మార్క్ ఐర్లాండ్ నెదర్లాండ్స్ యునైటెడ్ కింగ్ డమ్ దేశాల పాస్ పోర్ట్ లు నాల్గవ స్థానంలో ఉన్నాయని తెలుస్తుంది. ఈ పాస్ పోర్ట్ తో 188 దేశాలలో వీసా లేకుండా ప్రయాణించవచ్చని అంటున్నారు.

ఇదే క్రమంలో... ఐదోస్థానంలో ఉన్న బెల్జియం చెక్ రిపబ్లిక్ మాల్టా న్యూజిలాండ్ నార్వే పోర్చుగల్ స్విట్జర్లాండ్ పాస్ పోర్ట్ లను కలిగి ఉన్న వ్యక్తులు 187 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చని అంటున్నారు.

ఇక ఈ ర్యాంకింగ్స్ లో భారత్ 80వ స్థానంలో ఉందని తెలుస్తుంది. భారతీయ పాస్ పోర్ట్ ఉన్న వ్యక్తులు వీసా లేకుండా ప్రపంచంలోని 57 దేశాలకు మాత్రమే ప్రయాణించవచ్చు. ఈ జాబితాలో చైనా 63వ స్థానంలో ఉండగా.. పాకిస్థాన్ 100వ స్థానంలో ఉందని తెలుస్తుంది. చైనా ప్రజలు వీసా లేకుండా 80 దేశాల్లోనూ పాకిస్థాన్ ప్రజలు 33 దేశాల్లోనూ ప్రయాణించవచ్చని అంటున్నారు.

## గుజరాత్‌లో భారీ వర్షాలు.. వరదనీటిలో తేలియాడిన కార్లు



గాంధీనగర్: భారీ వర్షాలు గుజరాత్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. మరికొన్ని రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అంచనావేసింది. ఈ క్రమంలో వానల కారణంగా రాజ్‌కోట్, సూరత్, గిర్ సోమనాథ్ జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు వరదనీటిలో చిక్కుకుపోయాయి. మంగళవారం పలుచోట్ల 300 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దాంతో అధికారులు ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించారు.

స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ గణాంకాల ప్రకారం.. గిర్ సోమనాథ్ జిల్లాలోని సూత్రపాడ తాలూకాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం జలదిగ్బంధానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కార్లు, ఇతర వాహనాలు నీటిలో తేలియాడుతున్న వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. వరదల కారణంగా దుకాణాలు మూసివేశారు. గిర్ సోమనాథ్‌లోని ఓ ప్రాంతంలో మొసలి జనావాసంలోకి ప్రవేశించిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో 43 రిజర్వాయర్లకు హైఅలర్ట్ ప్రకటించినట్లు గుజరాత్ ప్రభుత్వం వెల్లడించింది. మరో 19 రిజర్వాయర్లకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్ఎఫ్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సెస్‌ను అధికారులు సిద్ధంగా ఉంచారు.

గత నెల గుజరాత్‌ను బిపోర్‌జాయ్ తుపాను వణికించిన సంగతి తెలిసిందే. దాని ప్రభావంతో గుజరాత్ తీర ప్రాంతంలో భీకర గాలులు, కుండపోతగా వర్షాలు కురిశాయి. ఆ సమయంలో ఆలయాలు, పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాలను మూసివేశారు. భారీ సంఖ్యలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

# రసాయనాల వినియోగం, విక్రయాలపై అవగాహన కార్యక్రమం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** యాసిడ్ దాడులు నివారణకు తీసుకునే చర్యలలో భాగంగా వివిధ అవసరాల నిమిత్తం యాసిడ్స్ విక్రయం, వినియోగం జరిపే వారిపై పూర్తి నిఘా పెట్టామని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు.

అనకాపల్లి జిల్లాలో రసాయనాలు (యాసిడ్స్) విక్రయంవినియయోగంలో దుర్వినియోగం కాకుండా అధిక మొత్తంలో రసాయనాలను భద్రపరచడం వలన కలిగే అనర్థాల పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బంగారం షాపు వర్తకులు, స్వర్ణకారులు, కాలేజీల యాజమాన్యం సంబందించిన లేబొరేటరీ నిర్వాహకులు, రసాయన విక్రయదారులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్వర్ణకారులు, రసాయనాల విక్రయిదారులకు ది పాయిజన్ యాక్ట్ - 1919 మరియు ఏపి పాయిజన్స్ (పొసెషన్ , విక్రయాలు) రూల్స్ -2016 లోని నియమ నిబంధనల గురించి అధిక మొత్తంలో రసాయనాలను భద్రపరచడం వలన కలిగే అనర్ధాల గురించి , రసాయనాల విక్రయం, వినియోగంలో దుర్వినియోగం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి క్షుణ్ణంగా వివరించి ఆ రసాయనాలను అమ్ముటకు, కొనుటకు, కలిగి ఉండుటకు సంబంధించిన నియమ నిబంధనలు లైసెన్స్ సంబంధించిన విషయాలపై అతిక్రమించిన వారిపై తీసుకొను చట్టపరమైన చర్యల గూర్చి అవగాహన కల్పించడం జరిగింది.ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పి వి.సుబ్బరాజు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, ఇలియాస్ అహ్మద్, మోహన్ రావు, గణేష్ అధికారులు, బంగారం వర్తకులు, రసాయనాలు అమ్మే వ్యాపారులు, కాలేజీల లేబోరేటరీలు నిర్వహించే ప్రతినిధులు, బ్యాటరీలలో ఏసీడ్ వాడే వినియోగదారులు మొదలగు వారు హాజరైనారు.

# మెడికల్ కళాశాల పనులు వేగవంతం కావాలి



**విజయనగరం:** నగరంలోని గాజులరేగ వద్ద నిర్మాణంలో వున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై వైద్య విద్యార్థులు వచ్చే లోగానే పెండింగ్‌లోని నిర్మాణ పనులన్నీ పూర్తికావాలన్నారు. అదే సమయంలో పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. గత పర్యటన నాటికి ప్రస్తుత పర్యటన సమయానికి పనుల్లో సాధించిన ప్రగతిని తెలుసుకున్నారు. వైద్య కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, లేబొరేటరీలు ఏ దశలో వున్నదీ పరిశీలించారు. లెక్చర్ హాళ్లు, లేబొరేటరీలు జూలై 25 నాటికి పనులు పూర్తిచేసి సిద్ధంచేస్తామని నిర్మాణ సంస్థ ఎన్.సి.సి. మేనేజర్ శ్రీనివాస్ వివరించారు. బోధన సిబ్బంది గదులను 27 నాటికి పూర్తిచేస్తామని తెలిపారు. ఫిజియాలజీ, ఎనాటమీ గదులు మాత్రమే కొంత పనులు పెండింగ్ వున్నాయని, వాటిని కూడా నెలాఖరు కల్లా పూర్తిచేస్తామన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనుల్లో 720 మంది కార్మికులు వున్నారని, నిర్మాణ పనులకు అవసరమైన పరికరాలు, సామాగ్రి అంతా సిద్ధంగా వుందన్నారు.

విద్యార్థుల హాస్టల్ భవనాలను, డైనింగ్ రూంలను కూడా కలెక్టర్ పరిశీలించారు. 27వ తేదీ నాటికి వీటి నిర్మాణం పూర్తిచేయగలమని నిర్మాణ సంస్థ ప్రతినిధులు వివరించారు. లెక్చర్ హాలులో ఇంటరాక్టివ్ ప్యానల్, స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. గచ్చులకు టైల్స్ వేసేటపుడు వాటి మధ్య ఖాళీలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కళాశాలకు నీటి సరఫరాపై కలెక్టర్ ఆరా తీశారు. ఇప్పటికే బోర్లు వేశామని నెలాఖరుకల్లా నీటిసరఫరా పనులు పూర్తవుతాయని ఇంజనీర్లు వివరించారు. వైద్య కళాశాలలో ప్రవేశానికి నిర్మించనున్న రహదారిపై కలెక్టర్ ఆరా తీశారు. రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించామని డి.ఇ. కుమార్ చెప్పారు.

ఈ పర్యటనలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మలీల, ఏపిఎంఎస్ఐడిసి డి.ఇ. కుమార్, వైద్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖ ఉత్తర నియోజకవర్గం 49వార్డులో “జగనన్న సురక్ష” క్యాంపు. : కె.కె రాజు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా “జగన్న సురక్ష” క్యాంపు కార్యక్రమంలో భాగంగా ఈ రోజున విశాఖ ఉత్తర నియోజకవర్గం 49వార్డు ASR నగర్ సచివాలయం వద్ద “జగనన్న సురక్ష” క్యాంపు జరిగింది.ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు పాల్గొని లబ్ధిదారులకు సంబందిత సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్,49వార్డు కార్పొరేటర్ అల్లు శంకర రావు, 48వార్డు ఇంచార్జ్ నీలి రవి,జోనల్ కమిషనర్ ఆర్.జి.వి క్రిష్ణ, MRO జయ, APD పద్మావతి, AE అర్చన, డైరెక్టర్లు యన్.రవి కుమార్, ఐ.రవికుమార్, సీనియర్ నాయకులు కమలకుమారి, సబ్బవరపు శ్రీను, మెర్సీ, శంకర్, సుధాకర్, శివ ప్రసాద్, చైతన్య, భాస్కర్, కిషోర్, సీనియర్ నాయకులు ఇతర ప్రభుత్వ అధికారులు, సచివాలయం సిబ్బంది,వాలంటీరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 70 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన గంగరాజు స్నేహితులు



పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ బీసీ కాలనీకి చెందిన కీర్తిశేషులు గుడివాడ గంగరాజు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి 10 వ తరగతి స్నేహితులు (1998-1999) 70 వేల రూపాయలు సమకూర్చి వారి కుటుంబానికి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు.

## ఓటు తొలగించేముందు నోటీసు ఇవ్వాలి



విజయనగరం: ఓటర్ల జాబితా నుంచి ఎవరిదైనా ఓటు తొలగించేముందు తప్పనిసరిగా నోటీసు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. మరణించిన ఓటర్ల పేర్లను కూడా, సంబంధిత కుటుంబానికి నోటీసు ఇచ్చిన తరువాత మాత్రమే తొలగించాలని స్పష్టం చేశారు. ఇచ్చిన నోటీసులను, ధరఖాస్తులను తప్పనిసరిగా ఫైల్ చేయాలని సూచించారు.

విజయనగరం నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జెసి మయూర్ అశోక్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బిఎల్ఓలదే కీలక పాత్ర అన్నారు. వీరు నేరుగా ఎన్నికల కమిషన్‌కు జవాబుదారీ అని స్పష్టం చేశారు. కమిషన్ నిబంధనలను తూచ తప్పకుండా అమలు చేయాలని, వాటికి అనుగుణంగా ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించాలని సూచించారు. ఒక కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్ లో ఉండేలా చూడాలన్నారు. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని, యువ ఓటర్లకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ప్రతీ ఓటరుకు ఖచ్చితమైన చిరునామా, డోర్ నెంబరు ఉండాలని, దీనికి అనుగుణంగా ఓటర్ల జాబితాలను సవరించాలని చెప్పారు. ఈ నెల 21 నుంచి ప్రారంభించనున్న ఇంటింటి సర్వే సమగ్రంగా నిర్వహించాలని, ప్రతీ ఇంటికీ వెళ్లి వివరాలను నమోదు చేయాలని జెసి ఆదేశించారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో ఇఆర్ఓ, ఎస్‌డిసి సూర్యనారాయణ, విజయనగరం తాశిల్దార్ కె.శ్రీనివాసరావు, ఎన్నికల డిటిలు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

# పార్లమెంట్లో బిజెపి పార్టీ మంత్రులు తీసుకొస్తున్న యూనిఫామ్ సివిల్ కోడ్ (యు.సి.సి) వలన ఆదివాసులకు అన్యాయం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): బుధవారం అరకు వ్యాలీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా మిత్రులకు సమావేశం నందు కాంగ్రెస్ పార్టీ పిసిసి డెలిగేట్ మెంబర్ శ్రీ పాచిపెంట చిన్నస్వామి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ మంత్రులు యూనిఫామ్ సివిల్ కోడ్ ప్రవేశ పెట్టబోతున్నారు దీనివలన భారతదేశంలో ఆదివాసులకు ప్రత్యేకంగా ఉన్న హక్కులు చట్టాలకు భంగం కలుగుతుంది 1/70 చట్టం కనుమరుగు అయ్యే ప్రమాదం ఉంది ప్రస్తుతం జీ. ఓ నెంబర్ 3 రద్దు ఐ నేటికీ నాలుగు సంవత్సరాలు అవుతుంది కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ రాష్ట్రంలో ఉన్న వైసిపి పార్టీ పాలక పార్టీలు నోరు మెదపటం లేదు దీనివలన ఆదివాసులకు ఉద్యోగుల భర్తీలో నిరుద్యోగులకు గిరిజన ఉద్యోగస్తులకు అన్యాయం జరుగుతుంది గిరిజనులకు ప్రత్యేక ఆచార వ్యవహారాలు కట్టుబొట్లు సాంప్రదాయాలు ఉంటుంది అందరితో సమానముగా పోటీ పడలేరు బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న యూనిఫామ్ సివిల్ కోడ్ వలన ఆదివాసులుసామాజికంగా ఆర్థికంగా నష్టపోతాము దీనిపైన గిరిజన ఎంపీలు ఎమ్మెల్యేలు తమ యొక్క వైఖరి స్పష్టం చేయాలని కాంగ్రెస్ పార్టీ నుండి డిమాండ్ చేస్తున్నాము యు. సి. సి. వలన ఆదివాసులకు నష్టం జరుగుతుంది విశ్లేషకులు ఆదివాసి మేధావులు ప్రజాసంఘాలు రాజకీయ మేధావులు విద్యార్థి సంఘాలు మరియు ఉద్యోగ సంఘాలు దీనిపైన ఖండించాలి. యు సి సి దీనికి కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నాము ఆదివాసులకు ప్రత్యేక చట్టాలు హక్కులు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ముందు ఉంటుంది ఆదివాసులకు హక్కులకు చట్టాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోదు కాంగ్రెస్ పార్టీ ఆదివాసుల పక్షాన పోరాటం చేయడానికి సిద్ధంగా ఉంటుందిఅని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోయి మోహన్ రావు ఉపాధ్యక్షుడు పాంగి గంగాధర్ సీనియర్.నాయకులు జంపరంగి వెంకట బాబు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరువైంది



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరువైంది అని శాసనసభ మాజీ సభ్యులు తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జ్ గండి బాబ్జి అన్నారు మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ గండి బాబ్జి సారధ్యంలో బుధవారం ఉదయం పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ గుడి దగ్గర నుండి మహిళల ఆత్మ గౌరవ ర్యాలీ నిర్వహించడానికి ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకోవడం జరిగింది వెంటనే సీఎం జగన్మోహన్ రెడ్డి దిష్టి బొమ్మకి చెప్పుల దండ వేసి దగ్ధం చేయడానికి మహిళలు ప్రయత్నించగా పోలీసులు దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకున్నారు స్వాధీనం చేసుకొగానె మహిళలు సీఎం డౌన్ డౌన్ మహిళలకు రక్షణ కల్పించాలి సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదాలు చేస్తూ బైఠాయించారు.

ఈ సందర్భంగా గండి బాబ్జి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టాలి.

మహిళలకు రక్షణ కల్పించాలి అని డిమాండ్ చేశారు

రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని అన్నారు టిడిపి వాళ్లకైతే ఒక న్యాయం వైసిపి వాళ్ళకి అయితే ఒక న్యాయమా అని ప్రశ్నించారు మహిళల రక్షణ కోసం దిశా చట్టం తీసుకువచ్చామని గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసింది శూన్యం అని ఎద్దేవా చేశారు రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు అనిత పై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టటం ఎంతవరకు సమంజసమని అన్నారు రానున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధ అనంతలక్ష్మి దక్షిణ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కేదారి లక్ష్మి తెలుగు మహిళా పార్లమెంట్ కార్యదర్శి గనగళ్ళ సత్య వి గాయత్రి ఫణి కుమారి పుక్కెళ్ళ రాజేశ్వరి ఏ శైలజ రామలక్ష్మి గోవిందమ్మ వేణుకుమారి ఒకవేళ సునీత నూక వేణి మునెమ్మ శిరీష్ కుమారి ఈశ్వరమ్మ వెంకటలక్ష్మి దేవి తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# వ్యవసాయ పరపతి అందించడమే లక్ష్యం



పాడేరు, (విశాఖ సమాచారమ్): రైతులకు వ్యవసాయ పరపతి అందించడానికి అధికారుల లక్ష్యం కావాలని సంయుక్త కలెక్టర్ జె. శివ శ్రీనివాసు పేర్కొన్నారు. జిల్లా సహకార శాఖ అధ్వర్యంలో బుధవారం కలక్టరేట్లో వ్యవసాయ, ఉద్యాన వన, మత్స్య, పశు సంవర్ధక శాఖ అధికారులకు, క్షేత్ర స్థాయి సచివాలయం సిబ్బందికి నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాపుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార చట్టం 1964లో ఏర్పాటు చేసారని అన్నారు. ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘాలు రాజ్యాంగబద్ధంగా ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. వ్యవసాయ రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సహకార రంగాన్ని పే చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయ కార్యక్రమాలను సొసైటీల ద్వారా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వ యోచనలో ఉందన్నారు. వ్యవసాయాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామాల్లో పర్యటించి సొసైటీలలో అనుబంధంగా ఉన్న రైతులను సంప్రదించి, వ్యవసాయ పెట్టుబడులు ఏ విధంగా సమకూర్చుకుంటున్నారో తెలుసుకోవాలన్నారు. గిరిజన రైతులను ప్రాధమిక వ్యవసాయ పరపతి సంఘాలలో సభ్యులుగా చేర్చాలని సూచించారు. రైతులకు పంట నష్టం లేకుండా సొసైటీల ద్వారా పంట కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. సొసైటీలకు పెట్రోలు బంకు ఏర్పాటు, రేషన్ డిపోలు నిర్వహణకు అనుమతులు ఇస్తామని చెప్పారు.

జిల్లా సహకార అధికారి ఎం. వి. రామకృష్ణ రాజు మాట్లాడుతు రైతులకు పరపతి సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. వ్యవసాయ పెట్టుబడులకు రుణాలు అందిస్తామన్నారు. ఎరువులు వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు సరఫరా చేయడం జరుగుతోందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి. ఆర్. రాకేష్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకలు, మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ, ఉద్యాన వన అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# బాబుకు బీజేపీ తలుపులు శాశ్వతంగా క్లోజ్



బీజేపీ చంద్రబాబు పొత్తుల వ్యవహారానికి ఇపుడు ఒక ముగింపు కనిపిస్తోంది. ఇంతకాలం ఊహాగానాలకు మాత్రమే పరిమితం అయిన బాబు బీజేపీ పొత్తు ఉండదన్న దానికి లేటెస్ట్ గా బలం ఇచ్చే విధంగా అనేక కీలకమైన పరిణామాలు జరిగాయి. బీజేపీ ఢిల్లీలో నిర్వహించిన ఎన్డీయే భేటీకి చంద్రబాబుకు ఆహ్వానం లభించలేదు.

చిన్నా చితకా పార్టీలు అసలు ఒక్క ఎంపీ కూడా లేని పార్టీలు చట్ట సభలలో టెక్నికల్ గా ప్రాతినిధ్యం లేని పార్టీలను పిలిచి పెద్ద పీట వేసిన బీజేపీ రాజకీయంగా అత్యంత సీనియర్ నేత ఈ రోజుకీ ఉభయ సభలలో నలుగురు ఎంపీలు కలిగిన చంద్రబాబుని మాత్రం కావాలని విస్మరించింది.

చిత్రమేంటి అంటే ఎన్డీయేను ఏర్పాటు చేసినపుడు చంద్రబాబు నాడు కీలకంగా ఉన్నారు. ఆయన వాజ్ పేయ్ అద్వానీలతో పాటుగా అతి ముఖ్య పాత్ర పోషించారు. ఎన్డీయే కన్వీనర్ గా చురుకైన పాత్రను బాబు నిర్వర్తించారు. నాటి ఎన్డీయే కూటమి ప్రధాని అయిన వాజ్ పేయ్ చంద్రబాబుకు ఎంతో గౌరవం ఇస్తూ ఉండేవారు.

అలా జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పిన చంద్రబాబు ఇపుడు మోదీ అమిత్ షాలకు చేదు అయిపోయారు అంటే అది బాబు చేసుకున్న స్వయంకృతాపరాధం అని అంటున్నారు. బాబు అవకాశ రాజకీయాల మూలంగానే ఈ రోజు జాతీయ స్థాయిలో ఆయన ఏ కూటమితోనూ భుజం కలిపి ముందుకు నడవలేని పరిస్థితి ఏర్పడింది అని అంటున్నారు.

ఒక వైపు రెండు రోజుల పాటు బెంగళూరులో విపక్ష కూటమి మీటింగ్ చాలా ఇంటరెస్టింగ్ గా జరిగింది. ఈ భేటీకి మొత్తం ఇరవై ఆరు పార్టీలు హాజరయ్యాయి. అలాంటి భేటీకి కూడా బాబుని పిలవలేదు. ఒకనాడు యునైటెడ్ ఫ్రంట్ ని ఏర్పాటు చేసి దానికి కూడా బాబు కన్వీనర్ గా ఉన్నారు. కూటములను జాతీయ స్థాయిలో కట్టడంలో బాబుకు ఉన్న విశేష అనుభవాన్ని ఎవరూ కాదనలేరు.

అంతే కాదు 2018 నుంచి కాంగ్రెస్ తో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగారు బాబు రాహుల్ తో కలసి జాయింట్ ప్రెస్ మీట్లను ఏర్పాటు చేశారు. తెలంగాణాలో కాంగ్రెస్ తో కలసి పొత్తులు పెట్టుకుని పోటీ చేశారు. ఇటువంటి నేపథ్యం ఉన్న చంద్రబాబు 2019 ఎన్నికల తరువాత మరోసారి మోడీ ప్రధాని కావడంతో విపక్ష కూటమి వైపు చూడడం మానుకున్నారు.

గడచిన నాలుగేళ్లుగా ఆయన బీజేపీ వైపే ఉండాలని భావిస్తూ అనుకూల ధోరణిని ప్రదర్శిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో చంద్రబాబును నమ్మదగ్గ నేస్తంగా విపక్ష కూటమి భావించడంలేదని అందుకే ఆయన్ని గత రెండు మీటింగులకు పిలవలేదని అంటున్నారు.

సరే బీజేపీ పొత్తు కోసం చూస్తున్న బాబుకు ఆ పార్టీ అయినా పిలిచి పెద్ద పీట వేసిందా అంటే అదీ లేదు. ఎన్డీయే ఏర్పాటుని తలచుకున్న మోడీ వాజ్ పేయి అద్వానీల సేవలను కూటమి వెనక వారు చేసిన కృషిని తలచుకున్నారు కానీ వ్యవస్థాపక సభ్యుడు అయిన చంద్రబాబుని మాత్రం కనీసంగా ప్రస్తావించలేదు అంటే బీజేపీ బాబు పట్ల ఏ విధంగా వ్యవహరిస్తోందో అన్నది అర్థం అవుతోంది.

ఒకనాడు మోడీ అమిత్ షాలను ఘాటుగా విమర్శించి ఎన్డీయే నుంచి బయటకు వెళ్ళిన బాబు అలా ఊరుకుంటే బాగుండేది కానీ ఆయన కాంగ్రెస్ కూటమితో చేతులు కలపడం మోడీని ఓడిస్తామని దేశమంతా తిరిగి ప్రచారం చేయడం వంటివి గుర్తున్నాయి కాబట్టే బీజేపీ ఆయన్ని దూరం పెట్టింది అని అంటున్నారు. అంతే కాదు రాహుల్ తో కలసి మీటింగ్స్ నిర్వహించిన బాబు ఏకంగా తెలంగాణాలో పొత్తు కూడా పెట్టుకున్నారు.

మరోసారి బాబు ఇలాంటి అవకాశ వాద రాజకీయాలకు పాల్పడరు అన్న నమ్మకం లేనందువల్లనే బీజేపీ ఆయనను దూరం పెట్టిందని శాశ్వతంగా ఎన్డీయే తలుపులు మూసేసింది అని అంటున్నారు. ఇక మీదట బీజేపీతో టీడీపీకి పొత్తులు అయితే కుదరకపోవచ్చు అని అంటున్నారు. ఒక విధంగా ఇది టీడీపీకి బాబుకు ఆశాభంగం అయిన పరిణామంగానే చూడాల్సి ఉంటుంది. అని అంటున్నారు. దీని మీద బాబు ఏమి చేస్తారు అన్నది చూడాల్సి ఉంది.

## వరి, కూరగాయల రైతులు కోసం.. సింజెంటా ఇండియా కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): వరి, పత్తి, కూరగాయల రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రముఖ అగ్-టెక్ కంపెనీ సింజెంటా ఇండియా ఇన్సిపియో, సిమోడిస్ ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా సింజెంటా ఇండియా కంట్రీ హెడ్, మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ ఈ అధునాతన ఉత్పత్తులు, వినూత్నమైన ప్లినజోలిన్ సాంకేతికత ఆధారంగా వివిధ తెగుళ్ల నుంచి పంటకు రక్షణను అందిస్తాయన్నారు. వాతావరణ మార్పులు, తెగుళ్ళ నిరోధకత నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవటానికి ఇవి అభివృద్ధి చేశామన్నారు. ఇన్సిపియో ఒక హై - ఎండ్ క్రిమిసంహారక కొత్త జాతుల కాండం తొలుచు పురుగులు, ఆకు ఫోల్డర్‌లు, వరి పంటపై దాడిని సమర్థవంతంగా ఎదుర్కొంటాయన్నారు. సిమోడిస్ వరి, పత్తి, కూరగాయలకు సీతాకోకచిలుకలు, చిమ్మట వంటి లెపిడోప్టెరా కీటకాల నుంచి రక్షణ అందిస్తుందన్నారు. మిరియాలు, వంకాయ, పత్తి, నేల గింజ, సోయాబీన్, ఎర్ర పప్పు తెగుళ్లను సరైన సమయంలో సమర్థవంతంగా నియంత్రించకపోతే 30 నుంచి 40 శాతం వరకు దిగుబడి నష్టపోయే అవకాశం ఉందన్నారు.

## మాస్ మహారాజ రవితేజ నటించిన 'రావణాసుర', ఈ ఆదివారం సాయంత్రం 6 గంటకు, మీ జీ తెలుగులో!

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించడంలో ఎప్పుడూ ముందుండే జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది. మాస్ మహారాజ రవితేజ నటించిన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర' సినిమాని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరో రవితేజ క్రిమినల్ లాయర్ రవీంద్రగా మెప్పించిన 'రావణాసుర', జూలై 23 ఆదివారం సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో!

రవీంద్ర (రవితేజ) ఓ జూనియర్ లయర్. మాజీ ప్రియురాలు అయిన క్రిమినల్ లాయర్ కనక మహాలక్ష్మి (ఫరియా అబ్దుల్లా) దగ్గర అసిస్టెంట్‌గా పనిచేస్తోంటాడు. ఫార్మా కంపెనీ సీఈఓ హారిక (మేఘా ఆకాష్) తండ్రి (సంపత్‌రాజ్) ఓ మర్డర్ కేసులో చిక్కుకుంటాడు. ఆ తర్వాత హారికతో పాటు సిటీలోని మరికొందరుప్రముఖులు హత్యలకు గురవుతారు. ఈ హత్యలకు రవీంద్రతో ఎలాంటి సంబంధం ఉంది? ఈ సీరియల్ మర్డర్స్ లో సాకేత్ (సుశాంత్) పాత్ర ఏమిటి? ఈ మర్డర్ మిస్టరీని ఏసీపీ హనుమంతరావు (జయరాం) ఎలా ఛేదించాడు? అనేదే ఈ సినిమా కథ.

దర్శకుడు సుధీర్ వర్మ డైరెక్షన్లో రూపొందిన ఈ సినిమాను అభిషేక్ నామా, రవితేజ సంయుక్తంగా నిర్మించారు. అయిదుగురు హీరోయిన్లు ఫరియాఅబ్దుల్లా, మేఘాఆకాష్, అనుఇమ్మాన్యుయేల్, పూజితాపొన్నాడ, దక్ష నగార్కర్ నటించారు. సంపత్ రాజ్, జయరాం, సుశాంత్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. మాస్కి కేరాఫ్ అయిన రవితేజ నెగెటివ్ షేడ్స్ అలరించిన ఈ సినిమాను మీరూ మిస్సవకండి.

## చాట్‌జీపీటీ, గూగుల్‌కు పోటీగా వచ్చేసిన మెటా




సంచలనాలు సృష్టిస్తున్న చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్ ఏఐ, గూగుల్ బార్డ్ చాట్‌బాట్‌కు పోటీగా ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా రంగంలోకి దిగింది. తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్ ఫ్రీ ఆఫ్ చార్జ్ వెర్షన్‌ను నిన్న విడుదల చేసింది. చాట్‌జీపీటీ, బార్డ్ చాట్‌బాట్‌లకు ఫౌండేషన్‌గా వ్యవహరించే భాషా నమూనాలను ఓపెన్‌ఏఐ, గూగుల్ అభివృద్ధి చేశాయి. ఇవి మానవ సృజనాత్మకతను, నైపుణ్యాన్ని అనుకరిస్తూ ప్రపంచాన్ని తమవైపు తిప్పుకున్నాయి.

ఇప్పుడు ఈ రెండు సంస్థలకు పోటీగా రంగంలోకి దిగిన మెటా జెనరేటివ్ ఏఐ ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా విడుదల చేయడానికి బదులుగా రీసెర్చర్ల కోసం ప్రత్యేకంగా లామా అనే భాషా నమూనాను అభివృద్ధి చేసింది. ఈ లామా అనేది ఓపెన్ సోర్స్. అంటే దాని అంతర్గత పనితీరు ఓపెన్‌ఏఐ, గూగుల్‌కు భిన్నంగా ఉంటుంది.

ఇది ఓపెన్ సోర్స్ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహిస్తుందని, నూతన టెక్నాలజీ నిర్మాణం కోసం డెవలపర్లకు ఇది అవకాశం కల్పిస్తుందని మెటా సీఈవో జుకర్‌బర్గ్ ఫేస్‌బుక్ ద్వారా తెలిపారు. అంతేకాదు, సాఫ్ట్‌వేర్ ఓపెన్ అయ్యాక భద్రతను కూడా మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ సరికొత్త శక్తిమంతమైన లామా 2గా పిలిచే ఈ మెటా మోడల్ వెర్షన్ మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ ద్వారా ఏ వ్యాపారానికైనా అందుబాటులో ఉంటుంది.

## 105 కళాకృతులను తిరిగి ఇస్తున్నందుకు
# ధన్యవాదాలు తెలిపిన ప్రధాన మంత్రి

**విజయవాడ, (పీఐబీ):** భారతదేశంలో వివిధ ప్రాంతాలకు మరియు సంప్రదాయాలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఉన్నటువంటి 105 కళాకృతులు, ఏవైతే అక్రమ రవాణా కు గురి అయ్యాయో యుఎస్ఎ నుండి తిరిగి వెనుక కు వస్తున్నాయి.

భారతదేశంలో వేరు వేరు ప్రాంతాలకు మరియు సంప్రదాయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి 105 కళా రూపాలు ఏవైతే అక్రమ తరలింపునకు గురయ్యాయో వాటిని మాతృభూమికి తిరిగి ఇస్తున్నందుకుగాను యుఎస్ఎకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలను తెలియజేశారు.

వాషింగ్టన్ డిసిలో భారత రాయబారి కార్యాలయం చేసిన ట్వీట్‌కు ప్రధాన మంత్రి ప్రతిస్పందిస్తూ - "ఇది భారతదేశం లో ప్రతి ఒక్కరికి సంతోషాన్ని కలిగిస్తుంది. దీనికి గాను యుఎస్ఎకు ఇవే కృతజ్ఞతలు. ఈ అమూల్యమైన కళాకృతులకు సంస్కృతి పరంగా మరియు ధర్మం పరంగా ఎంతో ప్రాముఖ్యత ఉంది. అవి స్వదేశానికి తిరిగి వస్తుండడం మన వారసత్వాన్ని మరియు ఘనమైన చరిత్రను పరిరక్షించడం కోసం మనం చాటుకొంటున్నటువంటి నిబద్ధతకు ఒక నిదర్శనం అని చెప్పాలి." అని ఒక ట్వీట్ లో పేర్కొన్నారు.

## సూరత్ యొక్క వజ్రాల పరిశ్రమ గతిశీలతను, వృద్ధిని కళ్ళకు కట్టే
# సూరత్ డైమండ్ బోర్స్



**విజయవాడ, (పీఐబీ):** గుజరాత్‌లోని సూరత్‌లో ఏర్పాటైన సూరత్ డైమండ్ బోర్స్ ప్రపంచంలోనే అతి పెద్ద కార్యాలయ భవనం అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు.

ప్రధాన మంత్రి ఒక ట్వీట్ లో "సూరత్ డైమండ్ బోర్స్ అనేది సూరత్ యొక్క వజ్ర పరిశ్రమ తాలూకు గతిశీలతకు మరియు వృద్ధికి అద్దం పడుతున్నది. అది భారతదేశంలో నవపారిశ్రామికత్వానికి సంబంధించిన స్ఫూర్తికి ఒక ప్రమాణంగా కూడా ఉన్నది. అది వ్యాపారానికి, నూతన ఆవిష్కరణలకు మరియు సహకారానికి ఒక కేంద్రం గా పనిచేస్తుంది. దీనితో మన ఆర్థిక వ్యవస్థకు ఉత్తేజం లభిస్తుంది మరియు ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయి." అని పేర్కొన్నారు.

# పారదర్శకంగా పిహెచ్‌డిల ప్రక్రియ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పీహెచ్‌డి కోర్సుల్లో ప్రవేశాల నుంచి పిహెచ్‌డి పట్టా పొందే వరకు ప్రక్రియ ఎంతో పటిష్టంగా, పారదర్శకంగా జరుగుతుందని ఏయూ అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు అన్నారు. ఏయూ ఆచార్యులు ఒకరు వర్సిటీ పీహెచ్‌డి ప్రవేశాలు, అవార్డుల మంజూరుపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని వీటిని వెనక్కి తీసుకోవాలని ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన ఆచార్యునిగా పనిచేస్తూ విశ్వవిద్యాలయాన్ని కించపరుస్తూ విమర్శలు చేయడం సర్వీసు నిబంధనల ఉల్లంఘనగా పరిగణించడం జరుగుతుందన్నారు.

విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి ప్రవేశాలకు ఒక నిర్దిష్ట విధానం, నియమావళి ఉంటుందన్నారు. దీనికి అనుగుణంగానే ప్రక్రియ మొత్తం జరుగుతుందనే విషయం గుర్తించాలన్నారు. వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగించే ఇటువంటి వ్యాఖ్యలను చేయడం మానుకోవాలని సూచించారు.

# ఉత్తరాఖండ్ ఘటనకు సంతాపాన్ని తెలిపిన ప్రధాన మంత్రి

**విజయవాడ, (పీఐబీ):** విద్యుదాఘాతం కారణంగా ఉత్తరాఖండ్‌లోని చమోలీలో జరిగిన ఒక దుర్ఘటనలో ప్రాణ నష్టం వాటిల్లినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంతాపాన్ని తెలిపారు. ఈ దుర్ఘటనలో గాయపడిన వ్యక్తులు త్వరగా పునఃస్వస్థులు కావాలని ప్రధాన మంత్రి ఆకాంక్షించారు. ఈ ఘటన లో బాధితులకు రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ లో స్థానిక పాలన యంత్రాంగం చేతనైన అన్ని విధాలగాను సాయాన్ని అందిస్తోందని ఆయన వెల్లడించారు.

ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ట్వీట్‌లో "అత్యంత బాధాకరం. ఉత్తరాఖండ్‌లోని చమోలీలో జరిగిన దుర్ఘటనతో అత్యంత దుఃఖం కలిగింది. శోకంలో మునిగిన కుటుంబ సభ్యులకు నేను నా యొక్క ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. ఈ దుర్ఘటనలో క్షతగాత్రులు అందరూ త్వరిత గతిన స్వస్థులు అవ్వాలని కోరుకొంటున్నాను. బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణలో స్థానిక పాలన యంత్రాంగం చేతనైన అన్ని విధాలగాను సాయపడడంలో తలమునకలుగా ఉంది" అని పేర్కొంది.

## రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సహకారంతో ఉచిత వినికిడి అవగాహన శిబిరం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయ ఆవరణలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సహకారంతో ఉచిత వినికిడి అవగాహన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 60 మందికి పైగా పింఛన్‌దారులు పాల్గొని తమ సమస్యలను వైద్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్ అవేర్ సంస్థ ద్వారా పింఛనుదారుల అవగాహనకు సంబంధించిన సమాచారాన్ని పొందారు అని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేగి నాగేశ్వరరావు తెలిపారు.

# ప్రయారిటీ భవనాలన్నీ సెప్టెంబర్ 15 నాటికీ పూర్తి చేయాలి



**విజయనగరం:** ప్రభుత్వ ప్రయారిటీ భావనాలైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు సెప్టెంబర్ 15 నాటికి ఎట్టి పరిస్థితిలోనూ పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 30 నుండి ఈ భవనాల నుండే కార్యాలయాలు పని చేయాలనీ స్పష్టం చేసారు. లక్ష్యాలను చేరని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి శుక్రవారం స్టేజి అప్డేషన్ చేయాలనీ, పురోగతి కనపడాలని సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఎం.పిడి.ఓ లు, డి.ఈ లు, ఎ.ఈ లతో ప్రయారిటీ భవనాల పురోగతిపై మండల వారీగా భవనాల వారీగా సమీక్షించారు.

గతంలో బిల్లుల చెల్లింపులు కాలేదని ఆలస్యం అయ్యాయని చెప్పేవారని, ప్రస్తుతం బిల్లులన్నీ పెండింగ్ లేకుండా చెల్లించడం జరిగిందని, ప్రతి మండలం నుండి లక్ష్యాలను పూర్తి చేయడానికి వారి కార్యాచరణ ప్రణాళికను, టైం లైన్‌ను చెప్పాలని, చెప్పిన గడువులోగా పూర్తి చేయని వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెల్లింపులు మొత్తం జరిగినా పనులు ఎందుకు పూర్తి కావడం లేదని ప్రశ్నించారు. ఏజెన్సీలతో మాట్లాడి ఎప్పటికి పూర్తి చేస్తారో టైం లైన్ తీసుకొని, వారితో నిరంతరం పని చేయించాలని అన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన భవనాలను వెంటనే ప్రారంభించడానికి చర్యలు తెసుకోవాలన్నారు. ఆన్లైన్‌లో కంప్లీషన్‌ని పెట్టారంటే భవనం ప్రారంభం కావల్సిందేనని అన్నారు. జూలై నెలాఖరు నాటికీ అన్నిటిని పూర్తి చేయడానికి ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ఫ్లోరింగ్ , పెయింటింగ్, ఎలక్ట్రిసిటీ , తలుపులు, కిటికీలు అన్నీ పూర్తైన తర్వాతనే కంప్లేషన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. పూర్తి చేయకుండా అప్లోడ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలనీ, ఆలస్యం చేస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందని అన్నారు. ఎస్.ఈ పంచాయతి రాజ్ ప్రతి రోజు ప్రొగ్రెస్‌ను సమీక్షించాలని, వారానికి ఒక సరి పూర్తి నివేదిక, ఖర్చు చేసిన నిధుల వివరాలను తనకు సమర్పించాలని ఆదేశించారు. ప్రతి రోజు క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించాలని, మెటీరియల్ కొరత లేకుండా, చూడాలని సూచించారు.

వ్యవసాయ పనులు మొదలైనందున రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు నిల్వ చేసుకునేందుకు స్థలం అవసరం ఉందని, ఆర్.బి.కె ల పై దృష్టి పెట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలనీ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం క్రింద చేపట్టిన పనులకు స్థానిక శాసన సభ్యులతో చర్చిస్తూ వెంటనే మొదలు పెట్టాలని, అలాగే వాటి బిల్లులను అప్లోడ్ చేయాలనీ తెలిపారు.

**నాన్ ప్రయారిటీ పనులకు ఒక్కో మండలానికి రూ. 60 లక్షల నిధులు :**

నాన్ ప్రయారిటీ పనులకు సంబంధించి ఒక్కో మండలానికి ఉపాధి హామీ నిధులతో 60 లక్షల వరకు ఖర్చు చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఈ పనులకు కూడా రెండు రోజుల్లో ప్రతిపాదనలను పంపించాలని ఎం.పి.డి.ఓలకు సూచించారు. ఈ నిధులతో సి సి రోడ్ లు, బిటి రోడ్లు, డ్రైనేజ్ లు చేపట్టాలని తెలిపారు. ఎక్కడెక్కడ అవసరం ఉందో గ్రామ సభలను నిర్వహించి, ప్రజా ప్రతినిధుల సిఫార్సులతో వెంటనే ప్రతిపాదనలను పంపాలను తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సి.ఈ.ఓ రాజ్ కుమార్, సి.పి.ఓ బాలాజీ, జిల్లా పంచాయతి అధికారి శ్రీధర్ రాజా, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ ఉమా శంకర్, పంచాయతి రాజ్ ఎస్.ఈ గుప్తా , జి.ఎస్.డబ్ల్యు జిల్లా కో ఆర్డినేటర్ నిర్మలా దేవి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 31 వరకు జన్ సాధారణ్ రైలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు భారతీయ రైల్వే స్పెషల్ ట్రైన్స్‌ని ప్రకటిస్తుంది. అప్పటికే నడుస్తున్న కొన్ని సర్వీసులను పొడిగిస్తుంటుంది. ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని విశాఖపట్నం నుంచి జన్ సాధారణ్ రైలును ప్రకటించింది. విశాఖపట్నం- రంగపర నార్త్, రంగపర నార్త్,- విశాఖపట్నం రూట్స్‌లో ఇది అందుబాటులో ఉండనుంది. మొత్తం అన్నీ జనరల్ బోగీలే ఉంటాయి. ఈ రైలుకు రిజర్వేషన్ అవసరంలేదు. వారానికోసారి నడుస్తుంది. ఆగస్ట్ 31 వరకు జన్ సాధారణ్ రైలు అందుబాటులో ఉంటుంది.

నెంబర్ 08562 విశాఖపట్నం నుంచి రంగపర నార్త్ వరకు ప్రతి ఆదివారం (శనివారం) మధ్యరాత్రి 12.10 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరుతుంది. సోమవారం ఉదయం 10.00 గంటలకు రంగపర నార్త్ చేరుకుంటుంది.నెంబర్ 08561 రంగపర నార్త్ నుంచి విశాఖపట్నం వరకు ప్రతి మంగళవారం తెల్లవారుజామున 5.15 గంటలకు రంగపర నార్త్‌లో బయల్దేరి బుధవారం మధ్యాహ్నం 3.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్, పలాస, బర్హంపూర్, ఖుర్దారోడ్ జంక్షన్, భువనేశ్వర్, కటక్ జంక్షన్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ జంక్షన్, అందుల్, డంకుని జంక్షన్, బర్ధమాన్ జంక్షన్, రంపూర్హత్ జంక్షన్, మాల్దా టౌన్, బర్సోయ్ జంక్షన్, కిషన్ గంజ్, న్యూ జల్పాయ్‌గురి జంక్షన్, జల్పాయ్‌గురి రోడ్, మథభంగ, న్యూకోచ్ బెహర్, కోక్రాఝర్, న్యూ బొన్గాయ్‌గావ్ జంక్షన్, బార్పేట రోడ్, నల్బరి, రంగియా జంక్షన్, టంగ్లా, ఉదల్‌గురి రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. సెకండ్ క్లాస్ సిట్టింగ్ ఉన్న కోచ్ లు 7, గార్డ్ కమ్ లగేజ్ వ్యాన్స్ 2 ఉంటాయి. అన్నీ జనరల్ బోగీలే. స్లీపర్ బోగీలు ఏర్పాటు చేయరనే విషయాన్ని ప్రయాణికులు గమనంలో ఉంచుకోవాలి.

# మహాబోధి సొసైటీ నిర్మాణం పనులు ప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహాబోధి సొసైటీ, మేకపాటి గౌతం రెడ్డి ఇంటర్నేషనల్ ధ్యాన, జ్ఞానక్షేత్రం (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ మెడిటేషన్ అండ్ ధమ్మ) నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో నిర్మాణానికి సంబంధించి హనీ గ్రూప్ సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఒప్పంద పత్రాలపై మహాబోధి సొసైటీ తరపున ఆర్.విజయ్ కుమార్, హనీగ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఎం.ఓబుల్ రెడ్డిలు సంతకాలు చేసారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ ఆంత్రపాలజీ విభాగ ఆచార్యులు పి.డి. సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం లాంఛనంగా భవన నిర్మాణం, ఆధునీకరణ పనులను ప్రారంభించారు. మహాబోధి సొసైటీ సూచించిన విధంగా నిర్మాణం పూర్తిచేసి ఏయూకు అందిస్తారు. భవన నిర్మాణానికి మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన రెడ్డి రూ. 1.4 కోట్లు విరాళంగా అందిస్తున్నారు. అదే విధంగా ఈ కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయడానికి అదనంగా మరొక రూ.60 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దాదాపు రూ 2 కోట్ల వ్యయంతో నిర్మితమౌతున్న ఈ కేంద్రం, మేకపాటి రాజమోహన రెడ్డి చేస్తున్న ఆర్థిక సహాయంతో నిర్మాణం పూర్తిచేసుకుని ప్రజలకు అందుబాటులోకి రానుంది.

ఆంధ్రవిశ్వవిద్యాలయం అందిస్తున్న సహకారం, మేకపాటి రాజమోహన రెడ్డి సౌజన్యంతో విశాఖ ప్రజలకు ఉపయుక్తంగా మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో ఈ ధ్యాన, జ్ఞాన క్షేత్రం పనిచేస్తుందన్నారు. భవిష్యత్తులో బోధన, పరిశోధన, ధ్యాన కేంద్రంగా దీనిని తీర్చిదిద్దుతామని మహాబోధి సొసైటీ ప్రతినిధి విజయ్ కుమార్ తెలిపారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, సమాజంలో శాంతిని పంచే కేంద్రంగా దీనిని నిలుపుతామన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అసెంబ్లీ మందిరం వెనక భాగంలో ధ్యాన, జ్ఞాన కేంద్రం నిర్మిస్తున్న ప్రాంగణంలో భూమిపూజ చేసి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు.

# స్థాయి సంఘం ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల జాబితా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయి సంఘం ఎన్నికల్లో పది మంది అభ్యర్థులు గెలుపొందారని జివిఎంసి కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జరిగిన స్థాయి సంఘ ఎన్నికల్లో 20 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా వారిలో పదిమంది అభ్యర్థులు గెలిచారని తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులలో ఊరుకోటి నారాయణ రావుకు 66 ఓట్లు, అక్కరమాని పద్మకు 64 ఓట్లు, పీలా లక్ష్మీ సౌజన్యకు 64 ఓట్లు, కోడిగుడ్ల పూర్ణిమకు 63 ఓట్లు, కంటిపాము కామేశ్వరికి 63 ఓట్లు, బల్ల లక్ష్మణరావుకు 63ఓట్లు, భూపతిరాజు సుజాతకు 63 ఓట్లు, గుడ్ల విజయసాయికి 62 ఓట్లు, బట్టు సూర్యకుమారికి 62 ఓట్లు, చల్లా రజినికి 61 ఓట్లు వచ్చాయని కమిషనర్ తెలిపారు.

# సెక్యూరిటీ రూమ్ ఏర్పాటు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో విద్యార్థినులకు ఏర్పాటు చేసి విద్య తరంగిణీ హాస్టల్ వద్ద నూతనంగా సెక్యూరిటీ రూమ్‌ని ఏర్పాటు చేసారు. బుధవారం ఉదయం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ దీనిని ప్రారంభించారు. విద్యార్థినుల హాస్టల్ వద్ద బద్రతను పెంచే విధంగా, సెక్యూరిటీ సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దీనిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ వినుత, సిఎస్ఓ మహ్మద్ ఖాన్, అసిస్టెంట్ ఇంజనీర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజార్ ప్రారంభించిన కాకాణి



గూడూరు పట్టణంలో ఒక కోటి 15 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన రైతు బజారును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మరియు సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మాత్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక గూడూరు శాసనసభ్యులు వరప్రసాద రావు, శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి గారు ,మేరిగా మురళి గారు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి,గూడూరు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మరియు సర్వేపల్లి నియోజకవర్గం పరిశీలకు రాలు, కోడూరు కల్ప లత, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ ,గూడూరు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యారం మంజులమ్మ గారు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోడూరు మీరారెడ్డి గారు, గూడూరు అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ యమునమ్మ, గూడూరు జడ్పిటిసి సభ్యురాలు యామిని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# గుళ్లబట్టి, డి-ఫారం భూములకు నష్టపరిహారం చెల్లించాలి



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** చందనాడ దళితుల భూములకు నష్టపరిహారం చెల్లించాలని CPM జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. నక్కపల్లి మండలం చందనాడ దళితులకు చెందిన గుళ్ళబట్టీల భూములను, డీ ఫారం భూములను వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ ఏర్పాటుకు భూములు ప్రభుత్వం వారు సేకరిస్తున్నారు. ఈ భూములకు వెంటనే దళితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, స్థానికులు పెదపూడి రమణ, యేడిద సన్యాసి, యేడిద మన్నియ్య, యేసు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

# బోరు కోసం వందల అడుగులు తవ్వితే సముద్రపు నీరు వచ్చేస్తుందా? అప్పుడేమవుతుంది?



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** "200 అడుగులు బోరు తవ్వితే కానీ నీళ్లు పడలేదండీ.. మేమైతే భవిష్యత్తులో ఇబ్బంది ఉండకూడదని ఏకంగా 300 అడుగులు కొట్టించాం..."- ఇలాంటి మాటలు తరచూ వింటుంటాం.

విశాఖపట్నంలోని సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ, జోడుగుళ్లపాలెం లాంటి తీరానికి సమీపంలో ఉన్న ప్రాంతాలతో పాటు పెందుర్తి, చినముషిరివాడ, రామకృష్ణానగర్ లాంటి ప్రాంతాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

ఇలా వందల అడుగుల లోతుకు బోర్లు వేయించడం వల్ల భవిష్యత్తులో తీర ప్రాంత నగరాలకు ప్రమాదముందని జియాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా సముద్రం నీరు భూమి లోపలి పొరల్లోకి చొచ్చుకొచ్చి, బోర్లు తీసినా ఉప్పు నీరు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

ఈ ఏడాది వేసవిలో బోర్లు వేసేందుకు ప్రయత్నించిన కొన్ని ప్రాంతాల్లో 150 నుంచి 200 అడుగుల వరకు వెళ్లినా నీళ్లు రాకపోవడం పొంచి ఉన్న ప్రమాదానికి హెచ్చరిక అని వారు చెబుతున్నారు.

ఇంతకూ విశాఖపట్నంలో నీటి అవసరాలు ఏ స్థాయిలో ఉన్నాయి? భూగర్భ జలాల లభ్యత ఎంత? భూగర్భ జలాలు తగ్గడం వల్ల రానున్న ముప్పును ఎదుర్కోవాలంటే ఏం చేయాలి?

**150 అడుగులు దాటాక ధైర్యం చేయలేకపోయా: విశాఖ వాసి**

మే, జూన్ నెలల్లో చాలా మంది తాము 200 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితి విశాఖలోని తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎండాడ, రుషికొండ, జోడుగుళ్లపాలెం వంటి ప్రాంతాల్లో కనిపించింది.

"నేను ఎండాడలో ఇల్లు కట్టుకుందామని ముందుగా మే నెలలో బోరు వేయించాను. 150 అడుగులు దాటినా నీరు పడలేదు. మా ఇంటి పక్క వాళ్లకు వందడుగులకే నీరు పడింది. వాళ్లు పదేళ్ల కిందట బోరు తీయించారు. నేను 150 అడుగులు దాటిన తర్వాత ధైర్యం చేయలేకపోయాను" అని విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి ఉమామహేశ్వరరావు చెప్పారు.

"గతంలో అక్కయ్యపాలెంలో ఉండే వాడిని. అక్కడ నాకొక సొంతిల్లు ఉంది. అక్కడైతే 2013లో బోరు వేయించాను. 70 అడుగులకే నీరు పడింది. ఎండాడలో మాత్రం 150 అడుగుల మేర వెళ్లినా నీరు పడలేదు" అని ఆయన విచారం వ్యక్తంచేశారు.

ఈ రెండు సందర్భాల్లోనూ బోరు వేయించే ముందు నీరు పడుతుందా, లేదా అనే పరీక్షలు చేయించలేదని ఉమామహేశ్వరావు చెప్పారు.

# ఎంఎస్ఎఫ్-5 లో చెత్త నిలవ ఉంచద్దు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలో 5వ జోన్ తాటిచెట్ల పాలెం ఎంఎస్ఎఫ్ లోని చెత్త ఎప్పటికప్పుడు తరలించాలని జివిఎంసి కమిషనర్ సీ ఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 3, 4, 5, 8 జోన్ల పరిధిలోని పాత జైలు రోడ్డు, జగదాంబ జంక్షన్, తాటిచెట్లపాలెం లోని MSF-5, పెందుర్తిలోని సుజాతనగర్, దత్తయిలాండ్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ తాటిచెట్ల పాలెంలోని ఎంఎస్ఎఫ్-5 లోని ఏ రోజు చెత్త అదే రోజు తరలించేందుకు మినీ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ని సందర్శించారు. జైల్ రోడ్డు లోని ఇందిరా గాంధీ విగ్రహం పరిసర ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు గల అవకాశాలను, జైల్ రోడ్ నుండి జగదాంబ జంక్షన్ వరకు రహదారి విస్తరణ, జంక్షన్‌ల అభివృద్ధి కొరకు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం 8వ జోన్ పరిధిలోని సుజాతనగర్ లో పర్యటించి గిరిప్రసాద్ నగర్లో నూతనంగా రహదారులు, జంక్షన్లు అభివృద్ధి కొరకు ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సుజాతనగర్‌లో పారిశుధ్యం సరిగా నిర్వహించడం లేదని, వెంటనే చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. 3వ జోన్ పరిధిలో సిరిపురంలోని దత్తయిలాండ్ ప్రాంతంలో రీసైకిల్ మెటీరియల్ తో తయారుచేసిన కుర్చీలు, టేబుల్స్ లను పరిశీలించి, ఆధునీకరణ విద్యుత్ అలంకరణ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశిస్తూ, కొన్ని సూచనలు చేశారు.

ఈ పర్యటనలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజనీర్లు వినయ్ కుమార్, సత్యనారాయణ రాజు, రామ్మోహన్ రావు, జోనల్ కమిషనర్లు ఆర్ జి వి కృష్ణ, మల్లయ్య నాయుడు, కార్యనిర్వాహక ఇంజనీర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# 19 ఏళ్ల యువకుడి గుండె ఆపరేషన్ కొరకు ఆర్థిక సహాయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** యలమంచిలికి చెందిన 'మన చారిచారిటబుల్ ట్రస్ట్' వాళ్ళు కర్రీ శాంతి వెంకట స్వామి, మరియు ఎల్లపు గోపి (మాజీ కౌన్సిలర్) ఆధ్వర్యంలో సోమలింగపాలేనికి చెందిన దొడ్డి యశోద రామకృష్ణ అనే 19 ఏళ్ల యువకుడికి గుండె ఆపరేషన్ చేయించేందుకు సహాయం చేశారు. అతని తల్లిదండ్రులు యువకుడి ఆరోగ్య పరిస్థితిని వివరించగా, తమ ట్రస్ట్ నుండి లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం అందించగలమని హామీ ఇచ్చారు.

# సముద్ర తీరంలో చంద్రయాన్-3 రాకెట్ శకలం



**ఇస్రో క్లారిటీ**

ఆస్ట్రేలియా సముద్ర తీరంలో కనిపించిన రాకెట్ శకలంపై ఇస్రో చీఫ్ సోమనాథ్ స్పందించారు. 'మేము దాన్ని పరిశీలించకుండా అది మాదేనా? కాదా? అనేది చెప్పలేం' అని అన్నారు. కానీ ఆ శకలం కచ్చితంగా రాకెట్లేనని.. అయితే 'భారత్‌కు చెందిన రాకెట్టే కావొచ్చు, కాకపోవచ్చు' అని సోమనాథ్ అభిప్రాయపడ్డారు. కాగా ఈనెల 14న భారత్ ప్రయోగించిన చంద్రయాన్-3కి చెందిన శకలమే ఆస్ట్రేలియా తీరంలో పడిందని ప్రచారం జరుగుతోంది.


క్లాసిఫైడ్స్, ప్రకటనల కొరకు సంప్రదించండి
8885687610, 7981904385

ఓం శ్రీ గురుభ్యో నమః ఓం శ్రీ గణేశాయ నమః ఓం శ్రీ సరస్వత్యై నమః

ప్రాథమిక పౌరోహిత్య శిక్షణ

శ్రీ శంకర చిన్మయం, అలకాపురం వారు పౌరోహిత్యంలో ప్రాథమిక శిక్షణ పొందుటకు అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ శిక్షణ కాలంలో అభ్యర్థుల వ్యక్తిగత సాధనకు మరియు దేవాలయం నిర్వహించుటకు కావలసిన అన్ని విధముల పూజా మరియు హోమ పద్ధతులను నేర్పించబడును.

వయస్సు : 16 నుండి 40 సంవత్సరముల వయస్సు గలవారు చేరవచ్చును.
విద్యార్హత : కనిష్టము 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
కోర్సు కాలం : ఆరు నెలలు.
దరఖాస్తులను పంపుటకు ఆఖరు తేది : 31-08-2023.
తరగతులు ప్రారంభపు తేది : 06-09-2023.

భోజనం మరియు వసతి ఉచితంగా కల్పించబడును

దరఖాస్తులు మరియు వివరాలకు:
శ్రీ శంకర చిన్మయం, అలకాపురం,
పిట్టలవానిపాలెం (మం), బాపట్ల (జిల్లా),
ఆంధ్ర ప్రదేశ్ – 522329. ఫోన్: 8790557412

దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్

విశాఖపట్నం మరియు హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న బల్క్‌డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక ధారుడ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2021 TO 2023 PASSED CANDIDATES

| Job Title | Qualification | Age | Stipend (P.M) |
|---|---|---|---|
| Trainee Supervisor / Graduate Apprentice | B.Sc. Chemistry | 21-25 yrs | Rs.18,000/- |
| | B.Pharmacy B.Tech (Chemical) | 21-25 yrs | Rs.20,000/- |
| | M.Sc. (Organic Chemistry/ Analytical Chemistry | 21-25 yrs | Rs.22,000/- |
| | M. Pharmacy (QA & RA) | 21-25 yrs | Rs.24,000/- |

గమనిక : పైన తెలిపిన కోర్సులు పూర్తి చేసిన మరియు ఆఖరి సంవత్సరము చివరి సెమిస్టర్ చదువుతున్న అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకొని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్ట్‌లలో పనిచేయవలసి ఉంటుంది.

| | |
|---|---|
| 18-07-2023 | SIR C R REDDY AUTONOMOUS (PG SEMINAR HALL) Beside APSRTC Bus Complex, Eluru |
| 19-07-2023 | SHRI VISHNU COLLEGE OF PHARMACY BHIMAVARAM |
| 20-07-2023 | SRI ASNM GOVT COLLEGE Near Fire Station, PALAKOLLU |

INTERVIEW TIME : 9:00 AM TO 2:00 PM

సదుపాయాలు : 1) బ్యాచ్‌లర్స్‌కు ఉచిత వసతి 2) ఉచిత యూనిఫాం 3) అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును, 4) భోజన ఖర్చులో రాయితీ

మెగా బ్రాహ్మణ వివాహ వేదిక

తెలుగు బ్రాహ్మణ వధూవరుల
వివాహ పరిచయ కార్యక్రమం
విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం
9-3-16, పీఠాపురం కోలనీ, (కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు) విశాఖపట్నం-530003



తేది : 06-8-2023, (ఆదివారం)
సమయం : మధ్యాహ్నం గం. 2.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.

శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,
హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,
బెంగుళూరు, పూణే వంటి ప్రముఖ
నగరాలలో పనిచేస్తున్న సుమారు
500 మంది వధూవరుల వివరములతో...

రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు
జనహిత మ్యాట్రిమోనీ
9393949345, 8074541283
Compli

Sugar Free Fitearly | నడివయస్కులకు దివ్య శక్తి ఫిట్ ఎర్లీ | थकावट से सत्वर उपसमन फिट एर्ली

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?
మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?

దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయాప్రోటీన్,
వే ప్రోటీన్,
బ్రాహ్మి,
హరితకి,
సీ భక్తారన్,
శొంఠి,
తులసి,
అశ్వగంధ

తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ట వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కరమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి
ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179
ఈ-మెయిల్: surampudi43@gmail.com

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052
Compli


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389, Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385.